# చాటింపు
CHATIMPU Telugu Daily

కరీంనగర్ సంపుటి: 19 సంచిక: 161 శనివారం, ఏప్రిల్ 4, 2026 ఎడిటర్ : యాతాకుల లింగయ్య పేజీలు: 12 వెల : రూ 1/-


## హామీల అమలుపై సందేహం వద్దు



దానికి సమాధానం తెలంగాణ రాష్ట్రమే

పుదుచ్చేరి ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి

## పంజాబ్ కింగ్స్ ఘన విజయం



## దక్షిణాసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా
# తెలంగాణ
## తెలంగాణ డీఎన్‌ఏలోనే వస్త్రకళ

2047 నాటికి తీర్చిదిద్దాలన్నది లక్ష్యం

పత్తి ఉత్పత్తిలో అగ్రగామిగా రాష్ట్రం..

మన పత్తికి అంతర్జాతీయంగా పేరు

రాష్ట్రానికి ప్రధాన బలంగా నిలిచిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్

గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లు అభివృద్ధి చేస్తాం

హైటెక్స్‌లో అటెక్సకాన్- 2026 సదస్సులో రేవంత్‌రెడ్డి కీలక ప్రసంగం



02

**హైదరాబాద్ (చాటింపు ప్రతినిధి):** తెలంగాణను 2047 నాటికి దక్షిణాసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందుకోసం ఆ రంగంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు భూమి, విద్యుత్, నీరు, తదితర మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహకాలు కల్పించడంతోపాటు వేగవంతమైన అనుమతులు మంజూరు చేస్తామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ -2026 (అటెక్సకాన్)లో ఆయన కీలక ప్రసంగం చేశారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన టెక్స్‌టైల్ రంగ ప్రతినిధులకు తెలంగాణ, హైదరాబాద్ తరఫున ఆయన స్వాగతం పలికారు. ఈ సదస్సులో పాల్గొంటున్నవారు కేవలం అతిథులు మాత్రమే కాదని, తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు, రాష్ట్ర విజన్‌ను పంచుకునే స్నేహితులని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి

మిగతా 2 లో

## ఏఐ సునామీ వస్తోంది

ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధం కావాలి..

బ్లూకాలర్ ఉద్యోగాలు పెంచాలి

విద్యావిధానంలో సంస్కరణలు అవసరం

సర్కారీ విద్య వైఫల్యంపై ఆలోచించాలి

రాష్ట్రంలో 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి



## విద్యార్థుల నుంచే ఫీజు వసూలు

2026-27 విద్యాసంవత్సరం నుంచి చేసుకోవచ్చు

హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు

పిటిషన్ వేసిన 15 కాలేజీలకే ఈ వెసులుబాటు

తుది తీర్పు భిన్నంగా ఉంటే ఫీజు వాపస్ ఇవ్వాలని స్పష్టీకరణ

కోర్టు మెట్లు ఎక్కేందుకు సిద్ధమవుతున్న మరిన్ని కాలేజీలు

రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రైవేటు కాలేజీల పోరుబాట

కాలేజీల్లో ఫీజుల వసూలు, ఫీజు రియింబర్స్‌మెంట్‌పై హైకోర్టు శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఫీజులను కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల నుంచే వసూలు చేసుకోవచ్చని జస్టిస్ జువ్వాడి శ్రీదేవి నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ప్రకటించింది.

## కేరళంలో రేవంత్ అసత్య ప్రచారం

'ఆరు గ్యారెంటీ'లపై రేవంత్ ప్రకటన

దశాబ్దపు మోసం : కిషన్ రెడ్డి



తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేశామంటూ సీఎం రేవంత్ రెడ్డి, కేరళం ఎన్నికల ప్రచారంలో ప్రకటించడం దశాబ్దపు మోసమని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి విమర్శించారు.

## తీవ్రస్థాయిలో యుద్ధం



### పశ్చిమాసియాలో దాడులు.. మౌలిక సదుపాయాల విధ్వంసం

ఇరాన్‌లోని ఎత్తయిన వంతెనను పేల్చేసిన అమెరికా

8 మంది మృతి.. 95 మందికి గాయాలు

ప్రతీకారంగా పశ్చిమాసియాలోని 8 భారీ వంతెనలను కూల్చేస్తామని ఇరాన్ ప్రకటన

కువైట్ చమురు రిఫైనరీపై దాడి.. అబుధాబిలో క్షిపణి శకలాలు పడి ఐదుగురు భారతీయులకు గాయాలు

మరో ఎఫ్-35ను కూల్చేశామన్న ఐఆర్‌జీసీ

గాలింపు చేపట్టిన అమెరికా హెలికాప్టర్‌ను కూడా..!

ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్కేంద్రాలు ధ్వంసం చేస్తాం

ఆలస్యం కాకముందే ఒప్పందానికి రావాలి: ట్రంప్



పశ్చిమాసియాలో యుద్ధం మరింత ఉధృతం అవుతోంది. పౌర మౌలిక సదుపాయాలపైనా దాడులు జరుగుతున్నాయి. ఇరాన్‌లో వంతెనను అమెరికా పేల్చివేస్తే.. గల్ఫ్ దేశాల్లోని చమురు, విద్యుత్ ప్లాంట్లు, డీసాలినేషన్ వ్యవస్థలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. అటు అమెరికా యుద్ధ విమానాన్నీ కూల్చివేసింది.

## టీఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది.. ఎవరైనా వాడుకోవచ్చు

ప్రొ. జయశంకర్ సిద్ధాంతాల ప్రకారం పని చేస్తాం

పార్టీ ఆవిర్భావం తర్వాత భారీగా చేరికలుంటాయి

సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలు మహిళలకు రిజర్వు అయితే వాటిలో ఒక దాన్నుంచి పోటీ చేస్తా

నిద్రావస్థలో బీఆర్ఎస్.. ప్రథమ శత్రువు కాంగ్రెస్సే

ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీని ప్రభుత్వం అడ్డుకోవటం లేదు

ప్రైవేటు టీచర్ల హక్కుల కోసం పోరాడుతాం: కవిత

తాను స్థాపించనున్న పార్టీకి పాత పేరు, కొత్త అజెండా ఉంటుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఖాళీగా ఉందని.. దాన్ని ఎవరైనా వాడుకోవచ్చునని అభిప్రాయపడ్డారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా ఒక టీమ్ పని చేస్తోందని తెలిపారు.



03

## గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చాం

ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం

బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు విమర్శలు



03




04

## భారత నేవీ అమ్ముల పొదిలోకి సరికొత్త అస్త్రం

అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' జలప్రవేశం

విశాఖలో ప్రారంభించిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

# ఏఐ సునామీ వస్తోంది

**ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధం కావాలి..**
**వైట్ కాలర్‌కు బదులు బ్లూకాలర్ ఉద్యోగాలు పెంచాలి**
**విద్యావిధానంలో సంస్కరణలు అవసరం**
**సర్కారీ విద్య వైఫల్యంపై ఆలోచించాలి**
**ఒక్కో విద్యార్థికి రూ.1.08 లక్షలు ఖర్చు**
**రాష్ట్రంలో 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి**
**ఏవీఎన్ లేక్‌ఫీల్డ్ గ్లోబల్ స్కూల్ ప్రారంభం**




**హైదరాబాద్ (చాటింపు ప్రతినిధి):** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సునామీలా వస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దీంతో పెద్ద ఎత్తున ఉద్యోగాలు పోతాయనే ఆందోళన నెలకొందని, దేశంలోని కోట్లాది మంది యువత నిరుద్యోగులుగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ సునామీని ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని, వైట్ కాలర్ ఉద్యోగాలకు బదులు బ్లూ కాలర్ ఉద్యోగాలు పెంచాలని అన్నారు. విద్యావిధానంలో మార్పులు తేవాలని, ఉపాధి కల్పించే దిశగా నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. ఇందుకు ఇప్పటినుంచే దూరదృష్టితో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో దేశంలో ఆకలి చావులు, నిరక్ష్యరాస్యత అధికంగా ఉండడంతో ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ముందుచూపుతో మంచి ప్రణాళికలు రచించి వాటిని అమల్లోకి తీసుకువచ్చారని చెప్పారు. దీని పర్యవసానంగానే ఇప్పుడు దేశంలో అన్ని చోట్లా విద్యాసంస్థలు ఏర్పాటయ్యాయని, అందరికీ విద్య అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో భారీ సాగునీటి ప్రాజెక్టులనూ ఆనాడే నిర్మించారని, దీంతో కోట్లాది ఎకరాల భూములు సాగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఆహార ధాన్యాలు ఇక్కడ నుంచి విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి దేశం చేరుకుందన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఏవీఎన్ లేక్‌ఫీల్డ్ గ్లోబల్ స్కూల్ ప్రారంభోత్సవానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడుతూ.. పేదరికం, వెనకబాటుతనం పోవాలంటే చదువు ఒక్కటే మార్గమని అన్నారు. కొందరికి భూములు ఉన్నప్పటికీ వెనకబాటుతనంతోనే ఉన్నారని, దీనికి కారణం చదువు లేకపోవడమేనని తెలిపారు. పేదరికంలో ఉన్నవారు చదువుకుని వెనుకబాటుతనం నుంచి బయటపడుతున్నారని చెప్పారు. చదువు మంచి జీవితాన్ని, గుర్తింపును ఇస్తుందన్నారు.

### ఒక్కో విద్యార్థికి రూ.1.08 లక్షల ఖర్చు..

ప్రభుత్వ విద్యాసంస్థల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని, దీనిపై ప్రజా ప్రతినిధులంతా ఆలోచించాలని సీఎం రేవంత్ అన్నారు. ప్రతి ఏటా ప్రభుత్వం విద్య కోసం భారీగా నిధులు ఖర్చు చేస్తున్నా.. ఆ మేర ఫలితాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రతి ఏటా రాష్ట్రంలో 1.10 లక్షల మంది విద్యార్థులు ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణులవుతున్నారు. కానీ, వీరిలో ఎంత మందికి ఉద్యోగావకాశాలు వస్తున్నాయి? వారు చదువుకున్న సర్టిఫికెట్‌కు, ఉద్యోగానికి సంబంధం ఉంటుందా? అనేది చూస్తే ఆందోళన కలుగుతోంది. నాణ్యమైన విద్య అందించకపోవడమే దీనికి కారణం" అని సీఎం అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే ఒక్కో విద్యార్థి కోసం ప్రభుత్వం ఏటా రూ 1.08 లక్షలు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఇటీవల ఒక సర్వేలో ఆరో తరగతి చదివే విద్యార్థులు మూడో తరతగతి పుస్తకాలు కూడా చదవలేకపోతున్నట్లు తేలిందన్నారు. 9 మంది పిల్లలు ఉన్నచోట ఐదుగురు టీచర్లు పనిచేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 26 వేల స్కూళ్లలో 18 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని వెల్లడించారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని 11 వేల ప్రైవేటు స్కూళ్లలో 33 లక్షల మంది చదువుతున్నారని చెప్పారు. "ప్రభుత్వ విద్యావిధానంలో, ప్రైవేటు విద్యావిధానంలో ఎందుకు మార్పు ఉంది? పేదలు కూడా తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలోనే చదివించుకోవాలని ఎందుకు అనుకుంటున్నారు?" అని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యావ్యవస్థలోని లోపాలు అత్యంత ప్రమాదకరమని, వీటిని సరిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

### 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు..

ప్రభుత్వం అందరికీ నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తోందని సీఎం తెలిపారు. విద్యపై రాష్ట్ర బడ్జెట్‌లో 8.3 శాతం నిధులు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 100 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని, 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.20 కోట్ల వ్యయంతో వీటిని నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 50 స్కూళ్ల నిర్మాణాలు మొదలు పెట్టామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని, వాటిలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్య అందిస్తామని చెప్పారు. బ్రేక్ ఫాస్ట్, భోజనం కూడా పెడతామన్నారు. అలాగే రేషనలైజేషన్ ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని, కనీసం 30 మంది విదార్థులకు తరగతి ఉండేలా వీటిని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. 2034 ఒలింపిక్స్‌ను భారత్‌లో నిర్వహించేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఒలింపిక్స్‌లో పతకాలు తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏవీఎన్ లేక్‌ఫీల్డ్ గ్లోబల్ స్కూల్ అద్భుతంగా ఉందని సీఎం ప్రశంసించారు. జిల్లా అధికారులు ఒకసారి ఇక్కడకు వచ్చి దీనిని పరిశీలించి యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణాల్లో అవసరమైన మార్పులు చేపట్టాలని సూచించారు.

### విద్య కోసం విదేశాలకు వద్దు: కిషన్‌రెడ్డి

విద్య కోసం ఇక్కడి విద్యార్థులెవరూ భారీగా ఖర్చు పెట్టి ఇబ్బందులు పడుతూ విదేశాలకు వెళ్లవద్దని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశ వ్యాప్తంగా నూతన విద్యావిధానాలు అమల్లోకి వచ్చాయని, ఇక్కడే అంతర్జాతీయ స్థాయిలో విద్యాసంస్థలు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. అనేక దేశాల నుంచి విద్యార్థులు ఇక్కడికే వస్తున్నారని చెప్పారు. విదేశాలకు డాక్టర్ చదివేందుకు వెళుతున్నవారు తిరిగి ఇక్కడకు వస్తే.. వారికి మళ్లీ మనమే అన్నీ నేర్పాల్సి వస్తోందన్నారు. డాక్టర్, ఇంజనీరింగ్ చదివేందుకు ఇక్కడ అనేక అవకాశాలున్నాయని, అన్ని జిల్లాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నామని, దీంతో సీట్లు పెరుగుతున్నాయని వివరించారు. విద్యా, వైద్యం అందించాలనే తపనతో ప్రణాళిక బద్ధంగా సీఎం పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘునందన్‌రావు, వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వీరందరికీ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి స్వాగతం పలికారు.

# దక్షిణాసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

విధానాలు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు తెలంగాణ బలం అని అన్నారు. పత్తి పొలాల నుంచి లండన్, న్యూయార్క్, పారిస్, మిలాన్, టోక్యో, దుబాయ్ ఫ్యాషన్ వేదికల వరకు తెలంగాణ రాష్ట్రం తనదైన ముద్ర వేసిందన్నారు. భారతదేశానికి అత్యుత్తమ వస్త్రాల తయారీలో గొప్ప చరిత్ర ఉందని, శతాబ్దాలుగా కళలు, సంస్కృతి, సంప్రదాయాలు టెక్స్‌టైల్ రంగాన్ని పరిపూర్ణంగా తీర్చిదిద్దాయని చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి పవిత్ర వస్త్రాలను సమర్పించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు.

### నిజాం కాలం నుంచే..

వస్త్రకళ అనేది తెలంగాణ డీఎన్‌ఏలోనే ఉందని సీఎం రేవంత్ అన్నారు. నిజాం కాలం నుంచే ప్రపంచ వ్యాపారులు హైదరాబాద్‌కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారని గుర్తుచేశారు. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్, నారాయణపేట చేనేత వంటి సంప్రదాయ వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. పత్తి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తోందని, ఇక్కడ పండే పత్తి నాణ్యతకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి పేరుందని తెలిపారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ రాష్ట్రానికి ప్రధాన బలంగా నిలుస్తోందన్నారు. హైదరాబాద్ గ్లోబల్ సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోందని, సినిమా రంగం, వారి ఫ్యాషన్‌ను కూడా తెలంగాణ టెక్స్‌టైల్ నుంచే పొందేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. యువతకు, ముఖ్యంగా మహిళలకు శిక్షణ ఇచ్చి, వారిలో సంప్రదాయం-ఆధునికత కలగలిపిన నైపుణ్యాలను పెంపొందిస్తామన్నారు. రానున్న రోజుల్లో ప్రపంచంలోని ప్రతి దేశంలో తెలంగాణలో తయారైన దుస్తులే ధరించేలా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తమ దృష్టిలో 'టెక్స్ టైల్' అంటే కేవలం వ్యాపారం మాత్రమే కాదని, అట్టడుగున ఉన్న నేతన్నకు అందించే 'సామాజిక న్యాయం' అని అభివర్ణించారు. తెలంగాణలో టెక్స్‌టైల్ రంగం కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదని, వేలాది కుటుంబాల జీవనాధారమని చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు.

### తమ్మిడికుంట పనులు పరిశీలించిన సీఎం

ఐటీ కారిడార్‌లోని తమ్మిడికుంట చెరువు అభివృద్ధి పనులను సీఎం రేవంత్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం హైటెక్స్‌లో జరుగుతోన్న టెక్స్‌టైల్ సదస్సులో పాల్గొన్న అనంతరం తిరిగి వెళ్తున్న సమయంలో కాన్వాయ్‌ని ఆకస్మికంగా చెరువు వైపు మళ్లించారు. చెరువు చుట్టూ తిరిగి.. పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. హైటెక్స్‌లో ఉన్న తమ్మిడికుంట చెరువు.. కబ్జాలతో 14 ఎకరాలకు కుచించుకుపోయింది. ప్రముఖ సినీనటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్.. కుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉందని గుర్తించి రెండెకరాల మేర హైడ్రా కూల్చివేసిన విషయం తెలిసిందే. అనంతరం నాగార్జున ఆ స్థలాన్ని అభివృద్ధి కోసం ప్రభుత్వానికి అప్పగించారు. కుంటలో ఉన్న ఇతరత్రా ఆక్రమణలనూ తొలగించి.. 28.05 ఎకరాల విస్తీర్ణంలో చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఇందుకోసం రూ.20 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు హైడ్రా వర్గాలు తెలిపాయి.

# గ్రూప్-1 నియామకాలపై సుప్రీం తీర్పు

### ఎక్స్ వేదికగా స్వాగతించిన సిఎం రేవంత్

**హైదరాబాద్ (చాటింపు ప్రతినిధి):** తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. తెలంగాణ గ్రూప్ -1 ఉద్యోగ నియామకాల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఇది ఉద్యోగ నియామకాల పట్ల తమ ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. కొలువుల కోసం సంవత్సరాల తరబడి కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసి, కన్నవారి కష్టంపై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్ -1 ఆశావహులకు ఇది పెద్ద ఊరటగా చెప్పుకొచ్చారు. ప్రజా ప్రభుత్వం వచ్చీ రావడంతోనే నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దుష్ట శక్తుల కుట్రలను కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్ నిర్మాణంలో తొలి గ్రూప్ -1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశామని వెల్లడించారు. వారికి మరోసారి సీఎం అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వం ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసి, నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించి, అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీఎస్సీ చైర్మన్, ఉద్యోగులు, సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ ట్వీట్ చేశారు.

# హామీల అమలుపై సందేహం వద్దు

### దానికి సమాధానం తెలంగాణ రాష్ట్రమే


### పుదుచ్చేరి ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్ (చాటింపు ప్రతినిధి):** పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు భాగస్వాములుగా ఉన్న లౌకిక ప్రగతిశీల కూటమి (ఎస్పీఏ) అభ్యర్థులను గెలిపించాలని ఆ రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క పిలుపునిచ్చారు. పుదుచ్చేరిలోని మనవేలి, ఎం.బాలం నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో ఎస్పీఏ ప్రకటించిన గ్యారెంటీలు అమలు సాధ్యమా అంటూ విపక్షాలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయని, అయితే ఆ సందేహాలకు సమాధానం తెలంగాణేనని తెలిపారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి క్యాబినెట్ సమావేశం నుంచే గ్యారెంటీల అమలు ప్రారంభించామన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ రక్షణకు కాంగ్రె స్, డీఎంకే కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

# రెండో విడత రైతు భరోసాకు రంగం సిద్ధం

### పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్లు అవసరం

### నిధులు సమకూర్చాలని సిఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద్ (చాటింపు) ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రంలోని సాగునీటి అవసరాలు, పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. యాసంగి సీజన్ పెట్టుబడి సాయం కింద అందించే 'రైతు భరోసా' రెండో విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ముహూర్తం ఖరారైంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఒత్తిడిలో ఉన్నప్పటికీ, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ అడుగు వేస్తోంది. రెండో విడత పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్ల భారీ మొత్తాన్ని సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, రుణాల చెల్లింపులు పూర్తయిన వెంటనే.. ఈ నిధులను సేకరించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. మొత్తం రూ. 9,000 కోట్ల అవసరం ఉన్న ఈ పథకాన్ని, నిధుల లభ్యతను బట్టి ప్రభుత్వం మూడు విడతల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఎకరం లోపు ఉన్న రైతులకు మొదటి విడత నిధులు అందగా, ఇప్పుడు ఒకటి నుంచి ఐదు ఎకరాల వరకు సాగు భూమి ఉన్న రైతులకు ఈ నెల రెండో వారంలో నగదు జమ కానుంది. ఐదు ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు ఈ నెలాఖరు కల్లా వారి వాటా నిధులు అందుతాయి. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం, ప్రతి ఎకరాకు సాగు ఖర్చుల కోసం ప్రభుత్వం రూ. 6,000 ఆర్థిక సాయం అందిస్తోంది. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకే ఈ నగదు బదిలీ కానుండటంతో ఎక్కడా జాప్యం లేకుండా రైతులకు మేలు జరుగుతుంది.

# విద్యార్థుల నుంచే ఫీజు వసూలు

**2026-27 విద్యాసంవత్సరం నుంచి చేసుకోవచ్చు**
**హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు**
**పిటిషన్ వేసిన 15 కాలేజీలకే ఈ వెసులుబాటు**
**తుది తీర్పు భిన్నంగా ఉంటే ఫీజు వాపస్ ఇవ్వాలని స్పష్టీకరణ**
**కోర్టు మెట్లు ఎక్కేందుకు సిద్ధమవుతున్న మరిన్ని కాలేజీలు**
**రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రైవేటు కాలేజీల పోరుబాట**



**హైదరాబాద్ (చాటింపు ప్రతినిధి):** కాలేజీల్లో ఫీజుల వసూలు, ఫీజు రియింబర్స్‌మెంట్‌పై హైకోర్టు శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఫీజులను కాలేజీల యాజమాన్యా లు విద్యార్థుల నుంచే వసూలు చేసుకోవచ్చని జస్టిస్ జువ్వాడి శ్రీదేవి నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ప్రకటించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం సకాలంలో చెల్లించటం లేదని, అందువల్ల ఫీజులను విద్యార్థుల నుంచే వసూలు చేసుకొనేందుకు అనుమతి ఇవ్వాలని 15 కాలేజీలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం వచ్చే విద్యా సంవత్సరం నుంచి మొత్తం ఫీజును విద్యార్థుల నుంచే వసూలు చేసుకోవచ్చని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. పిటిషన్ వేసిన కాలేజీలకు మాత్రమే ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని స్పష్టంచేసింది. అయితే, తుది తీర్పునకు లోబడి ఫీజుల వసూలు విధానం ఉంటుందని స్పష్టంచేసింది. తుదితీర్పు మధ్యంత ఉత్తర్వులకు భిన్నంగాఉంటే విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజులను కాలేజీలు తిరిగి చెల్లించాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. అంతకు ముందు 15 ప్రైవేటు కాలేజీల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో ప్రభుత్వం విపరీత జాప్యం చేస్తుండటంతో కాలేజీలను నడపలేకపోతున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఉన్న నిబంధనల ప్రకారం కాలేజీలు విద్యార్థుల నుంచి నేరుగా ఫీజులు చేసుకోలేవని, ప్రభుత్వం ఇస్తేనే స్వీకరించాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. ఇలాగైతే కాలేజీల నిర్వహణ అసాధ్యమని అన్నారు. ప్రభుత్వం ఇవ్వకపోతే కాలేజీలకే నేరుగా వసూలు చేసుకొనే హక్కు ఇవ్వాలని, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులో జాప్యం చేస్తే 18 శాతం వడ్డీ ఇవ్వాలని, ఆ మొత్తం ప్రభుత్వం నేరుగా విద్యార్థులకే చెల్లించేలా ఆదేశాలివ్వాలని కోరారు. వాదనల అనంతరం పిటిషనర్లకు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకొనే అవకాశం ఇస్తూ ధర్మాసనం మధ్యంతర ఆదేశాలిచ్చింది.

### ఫీజు బకాయిల కోసం మళ్లీ పోరుబాట

ఈ ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రంలోని ఇతర ప్రైవేటు కాలేజీ కూడా ఇదే విధమైన ఉత్తర్వుల కోసం హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నాయి. దీనిపై యాజమాన్యాలు శుక్రవారం సమావేశమై నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మరోవైపు ఫీజు బకాయిల వసూలు కోసం మళ్లీ ఆందోళనలు చేపట్టాలని తెలంగాణ ప్రైవేటు కాలేజీల యాజమాన్య సంఘాల సమాఖ్య (ఫాతీ) నిర్ణయించింది. శుక్రవారం నగరంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఫాతీ చైర్మన్ రమేశ్ బాబు తదితరులు పాల్గొని గతంలో మంత్రులు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డిల కమిటీతో వెంటనే భేటీ కావాలని ఫాతీ నిర్ణయించింది. వారినుంచి సానుకూల నిర్ణయం రాకుంటే 11న రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి తదుపరి కార్యచరణ ప్రకటించాలని సమావేశంలో తీర్మానించారు.

# టీఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది.. ఎవరైనా వాడుకోవచ్చు

**ప్రొ. జయశంకర్ సిద్ధాంతాల ప్రకారం పని చేస్తాం**
**పార్టీ ఆవిర్భావం తర్వాత భారీగా చేరికలుంటాయి**
**సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలు మహిళలకు రిజర్వు అయితే వాటిలో ఒక దాన్నుంచి పోటీ చేస్తా**
**నిద్రావస్థలో బీఆర్ఎస్.. ప్రథమ శత్రువు కాంగ్రెస్సే**
**ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీని ప్రభుత్వం అడ్డుకోవటం లేదు**
**ప్రైవేటు టీచర్ల హక్కుల కోసం పోరాడుతాం: కవిత**



**హైదరాబాద్ (చాటింపు ప్రతినిధి):** తాను స్థాపించనున్న పార్టీకి పాత పేరు, కొత్త అజెండా ఉంటుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఖాళీగా ఉందని.. దాన్ని ఎవరైనా వాడుకోవచ్చునని అభిప్రాయపడ్డారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా ఒక టీమ్ పని చేస్తోందని తెలిపారు. శుక్రవారం జాగృతి కార్యాలయంలో మీడియాతో కవిత ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తమ పార్టీకి బిహార్ సిద్ధాంతకర్త ఎవరూ లేరంటూ.. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో ఒప్పందాలు చేసుకునే పార్టీలపై పరోక్షంగా చెణుకులు విసిరారు. ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల ప్రకారం తమ పార్టీ నడుస్తుందన్నారు. ఆవిర్భావ సభకు ఇతర పార్టీల నేతలను ఆహ్వానించడం లేదని, వేదికపైనే తమ అజెండా చెబుతామని, యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని కవిత వెల్లడించారు. ఎజెండా తెలియజేసిన తర్వాత పెద్దఎత్తున చేరికలు ఉంటాయని, విదేశాల్లో ఉంటున్న తెలంగాణ బిడ్డలు కూడా పార్టీలో చేరతామంటున్నారని తెలిపారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ తమకు గొప్ప అవకాశమని చెబుతూ.. సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలు మహిళలకు రిజర్వు అయితే వాటిలో ఒకదాన్నించి పోటీ చేస్తానని చెప్పారు. బీఆర్ఎస్ నిద్రావస్థలో ఉందని, తమకు ప్రథమ శత్రువు కాంగ్రెస్సేనని.. తమ పోరాటం ఆ పార్టీపైనే ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌ను ఆగం చేయాలని చూస్తున్నారని, అసలు సిటీని చంపకుంటే చాలని కవిత అన్నారు. రేవంత్ రెడ్డి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారంచేసి ఆ పార్టీని ఓడించారని.. ప్రస్తుతం కేరళలో ప్రచారం చేస్తున్నారని, అక్కడా కాంగ్రెస్‌ను ఓడిస్తారని ఎద్దేవా చేశారు. అమరావతి బిల్లు సందర్భంగా భద్రాచలం ఐదు గ్రామాల గురించి పార్లమెంటులో తెలంగాణ ఎంపీలు ప్రస్తావించాల్సి ఉండాల్సిందని, కానీ వారు పట్టించుకోలేదన్నారు.

### ఫీజుల పేరిట ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీ

ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల నియంత్రణలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. ప్రస్తుతం ఏం చర్యలు తీసుకున్నారని కవిత ప్రశ్నించారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి ఫీజుల నియంత్రణ చట్టం ఎందుకు తీసుకురాలేదని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విద్యాకమిషన్ అతి చెత్త నివేదిక ఇచ్చిందని.. ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలనే సిఫారసు తప్ప దాంట్లో ఆమోద యోగ్యమైనది మరేదీ లేదని విమర్శించారు. రాష్ట్రంలో 12 వేల ప్రైవేటు స్కూళ్లలో 38 లక్షలమంది విద్యార్థులు చదువుతున్నారని, యాజమాన్యాలు ఒకేసారి 30 నుంచి 40 శాతం ఫీజులు పెంచి, దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. తాను బీఆర్ఎస్లో ఉన్నప్పుడు తనను నిజామాబాద్ కే పరిమితం చే సినప్పటికీ.. నారాయణ, చైతన్యలాంటి కార్పొరేట్ సంస్థలు అక్కడికి రాకుండా అడ్డుకున్నానని కవిత తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వేర్వేరు పేర్లతో ఆ సంస్థలు నిజామాబాద్‌కు వచ్చాయన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజులు పెంచుతున్న స్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రుల జీతాలు పెరగడం లేదని.. 7 శాతం నుంచి 8 శాతం ఫీజు పెంపునకు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని సూచించారు. ఏటా భారీగా ఫీజులు పెంచుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు వాటిలో పనిచేస్తున్న టీచర్లు, ఉద్యోగుల జీతాలు మాత్రం పెంచడం లేదన్నారు. కార్పొరేట్, నార్త్ఇండియన్ స్కూళ్ల వారు తెలంగాణ వారికి కనీసం ధోబీగా కూడా అవకాశం ఇవ్వడం లేదని, అలాంటి వాటికి పర్మిషన్ ఇవ్వొద్దని కోరారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్ల పరిస్థితి దుర్భరంగా ఉందని, వారి హక్కుల సాధన కోసం పోరాడుతామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఉద్యమిస్తామని కవిత తెలిపారు.

# గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

**తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చాం**
**ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం**
**బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు విమర్శలు**



**నారాయణపేట :** గిరిజనులకు ఉన్న 6 శాతం రిజర్వేషన్‌ని 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనతా ఆయనకే దక్కుతుందన్నారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం బావోజీ జాతరకు మాజీ మంత్రులు హరీశ్ రావు, శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..'లోక్ మసంద్ మహారాజ్ జాతరకు రావడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంతానికి రూ.8 కోట్లతో బ్రిడ్జి వేయించింది మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి. ఈ దేవాలయ అభివృద్ధికి, గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ ఎంతో చేశారు. మా తండాలో మా రాజ్యం అంటే ఎవ్వరూ పట్టించుకోలేదు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌ది. అన్ని రంగాల్లో కేసీఆర్ వారికి రిజర్వేషన్లు తెచ్చారు. గిరిజనులకు ఇప్పుడు కాంగ్రెస్ చేసింది గుండు సున్నా. ఎస్సీ, ఎస్టీలకు డిక్లరేషన్ ఇచ్చి వారు చేసిందేమీ లేదు. రూ.2,730 కోట్లు ఎస్టీలకు బ్జడెట్‌లో పెట్టి కేవలం రూ.50 కోట్లే ఖర్చు చేశారు. గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.. ఒక్కరికీ ఇవ్వలేదు. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యకు దూరం చేస్తున్నారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్లు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కూడా ఇవ్వడం లేదని ఆక్షేపించారు. సంత్ సేవాలాల్ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు ప్రకటించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఎస్టీల ఓట్లు కావాలిగానీ, వాళ్ల సంక్షేమం పట్టించుకోరా?అని ప్రశ్నించారు. కేరళలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేశామని బడాయి మాటలు చెబుతున్నారని విమర్శించారు.

మా లంబాడీలను దగా చేశారు. సీఎం రేవంత్, ఆయన మనుమడు ఫుట్ బాల్ ఆడేందుకు డబ్బులు ఉంటాయి కానీ ఎస్టీలకు ఇచ్చేందుకు లేవా?. లగచర్లలో లంబాడీల భూములు గుంజుకుని సీఎం రేవంత్ రెడ్డి వారిని జైలులో పెట్టారు. ఇక్కడ చేసింది చాలదని కేరళకు పోయి గొప్పలు చెబుతున్నారు. ఇంట్లో ఈగల మోత అంటే కేరళపోయి పల్లకీల మోత అన్నట్లు ఉంది. కొడంగల్ నియోజకవర్గంలో ఏ గ్రామంలో రుణమాఫీ వంద శాతం జరిగిందో రేవంత్ చూపించాలని సవాల్ చేశారు. నేను కొడంగల్ వచ్చినా గ్రామసభల్లో మీ నాయకులను జనం నిలదీస్తున్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేశారు. ప్యాకేజ్-3లో కొంత పని మాత్రమే మిగిలి ఉంది. త్వరగా ఆ పని పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరొస్తుందని చేయలేదు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. మీ నిర్లక్ష్యం వల్ల పాలమూరు ప్రజలకు అన్యాయం జరిగిందని అన్నారు.

### బిసిలను మోసం చేసిన కాంగ్రెస్

బీసీలకు,కుర్వ, గొల్ల, కురుమలకు రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలో కొమురయ్య విగ్రహానికి మాజీ మంత్రులు హరీష్ రావు, శ్రీనివాస్ గౌడ్ , లక్ష్మారెడ్డి , ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ బీసీలకు వేల కోట్ల బడ్జెట్ ఇస్తామని కేవలం రూ. 7 కోట్లు మాత్రమే నిధులు ఖర్చు చేసినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. శాసన సభలో రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీసినట్టు వెల్లడించారు. యాదవులకు గొర్లు ఇస్తామని, నగదు బదిలీ పథకం అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని తెలిపారు. కనీసం మంత్రి వర్గంలో అవకాశం కల్పించలేదని చెప్పారు.దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ కేసీఆర్‌ను కోరితే వెంటనే అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ పచ్చబడాలని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు హరీష్ రావు అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. గతంలో 14 రోజులకు ఒకసారి నీళ్ల రాగా బీఆర్ఎస్ హయాంలో ప్రతి రోజు నీళ్ల ఇచ్చామని వివరించారు.రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేమని, సాగు నీరు అందించేందుకు పూర్తి ప్రయత్నాలు చేసామని తెలిపారు. పాలమూరు ప్రాజెక్ట్ 90 శాతం పూర్తి చేశామని వెల్లడించారు. రాజకీయంగా బీసీలకు సమాన అవకాశాలు కల్పించాలని, బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ లు ఇస్తామని మోసం చేశారని తెలిపారు .విద్య,ఉద్యోగాల్లో కూడా రిసర్వేషన్ ఇవ్వడం లేదని ఆరోపించారు.

# కాంగ్రెస్‌పై రెండేళ్లలోనే ప్రజల్లో వ్యతిరేకత



## రేవంత్ రెడ్డి దిగిపోవాలని కోరుకుంటున్నారు

**మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

**జగిత్యాల :** కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ రానున్న రోజుల్లో ఊహించలేని పరిస్థితి ఎదుర్కొంటుందని కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జోస్యం చెప్పారు. తాను ఏ పార్టీలో చేరాలనేది కార్యకర్తల కోరిక మేరకే ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు విసుగొచ్చిన రాష్ట్ర ప్రజలు మార్పు రావాలి.. రేవంత్ రెడ్డి పోవాలనే ఆలోచన వచ్చిందన్నారు. జగిత్యాలలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజల సంక్షేమంతో పాటు ప్రాజెక్టుల నిర్వహణ ప్రధాన అంశమని తెలిపారు. తెలంగాణకు జీవనాడి ప్రాణహిత జలాలను వాడుకోవడంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని ఆయన తెలిపారు. అభిమానుల ఆలోచనలకు అనుగుణంగా ఏ పార్టీలో చేరాలనేదానిపై నిర్ణయం తీసుకుంటానని జీవన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్‌ను వీడిన తర్వాత జగిత్యాలలో తొలిసారిగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ప్రాణహిత నదీ జలాలను వినియోగించుకోకపోవడం, పునరుద్ధరించక పోవడం రేవంత్ నిర్లక్ష్య పాలనకు నిదర్శనమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన రెండేళ్లలోనే మార్పు రావాలనే పరిస్థితి వచ్చిందన్నారు. భాజపా, బీఆర్ఎస్ నాయకులకు తనపై ఉన్న అభిమానానికి జీవన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అయితే మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. త్వరలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలకు వెళ్లి జీవన్ రెడ్డిని ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 13న జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఆ రోజు మంచి ముహూర్తం ఉండటంతో గులాబీ కండువా కప్పుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నెల 6న అమెరికా నుంచి తిరిగి వచ్చిన వెంటనే కేటీఆర్.. జీవన్ రెడ్డిని కలిసి పార్టీలోకి ఆహ్వానించనున్నట్లు సమాచారం. జగిత్యాల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌ను బలోపేతం చేసేందుకు జీవన్ రెడ్డిని పార్టీలోకి తీసుకోవాలని కేటీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి, క్రియాశీల సభ్యత్వానికి జీవన్ రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసిన ఆయన.. నిత్యం జనంలోనే ఉంటూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జగిత్యాల ప్రాంతంలో బలమైన నేతగా ఉన్న జీవన్ రెడ్డి.. గులాబీ పార్టీలో చేరితే స్థానికంగా బీఆర్ఎస్‌కు మంచి ప్రయోజనం కలుగుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# కేరళంలో రేవంత్ అసత్య ప్రచారం

**'ఆరు గ్యారెంటీ'లపై రేవంత్ ప్రకటన దశాబ్దపు మోసం : కిషన్ రెడ్డి**



**హైదరాబాద్ (చాటింపు ప్రతినిధి):** తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేశామంటూ సీఎం రేవంత్ రెడ్డి, కేరళం ఎన్నికల ప్రచారంలో ప్రకటించడం దశాబ్దపు మోసమని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారెంటీల అమలు తెలంగాణలో పూర్తిగా విఫలమైందని, ఒక్క పథకం కూడా సమర్థంగా అమలు కాలేదన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాల యంలో ఆయన మాట్లాడుతూ.. అమలు చేయని పథకాలను అమలు చేసినట్టు చెప్పడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. రేవంత్ కేరళంకు ఎందుకు వెళ్లారో అందరికీ తెలుసని, తెలంగాణ నుంచి డబ్బులు పంపుతున్నారనే అనుమానాలు ప్రజల నుంచి వస్తున్నాయని పేర్కొన్నారు. మరోవైపు.. రాజకీయ టూరిస్టుల వలలో పడవద్దంటూ కిషన్‌రెడ్డి, కేరళం ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. సీఎం రేవంత్ కేరళం ఎన్నికల ప్రచారంలో అసత్యాలను ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తీవ్రంగా దెబ్బతీశారని, సరైన ఆర్థిక ప్రణాళిక లేకుండా పరిపాలన సాగిస్తూ రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టారని లేఖలో ప్రస్తావించారు.

# బీఆర్ఎస్‌లో ఇంటి గొడవలు

### బీజేపీలో రాముడి రాజకీయం

**ఈ రెండు పార్టీలకు తెలంగాణలో కాలం చెల్లింది**
**ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే వందసీట్లు సాధిస్తాం**
**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్**



**మంచిర్యాల :** తెలంగాణ రాజకీయాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోయిందని, బీజేపీకి రాష్ట్రంలో స్థానం లేదని ఆయన అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో కాంగ్రెస్ నేతలతో భేటీ అయిన ఆయన.. ఈ మేరకు ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని రకాల కుట్రలు పన్నినా.. కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉంది. అందుకు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో కొంత కాలంగా అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. కేసీఆర్ కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కవిత వేరు కుంపటి పెట్టుకోవడంతో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడిందన్నారు. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై.. కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఆయన అసెంబ్లీకి కూడా రావడం లేదు. ఇలాంటి పరిస్థితిలో బిఆర్ఎస్ రోజురోజుకు దిగజారుతోందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ.. దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడుగుతోంది. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు.. అందుకే ఆ పార్టీని దూరం పెడుతున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో 100 సీట్లు ఖాయం' అని అన్నారు. బీజేపీ కులం, మతం పేరుతో రాజకీయాం చేస్తోందని..ఆ పార్టీకి తెలంగాణలో స్థానం లేదని విమర్శించారు. రాముడేమైనా బీజేపీ జాగీరా.... వాళ్ల పార్టీల సభ్యత్వం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేనట్టుగా తెలంగాణలో ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తిం పు ఉంటుందని అన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపే తానికి అందరూ కృషి చేయాలన్నారు. సన్నబియ్యం పథకం దేశంలోనే చారిత్రాత్మకమన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు కాంగ్రెస్ కడుతోందన్నారు. బీఆర్ఎస్ హయాం లో నేతల జేబుల్లోకి డబ్బులు వెళ్లాయన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు స్కీం సక్సెస్ గా నడుస్తోందన్నారు. బీజేపీ రాష్టాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదన్నారు. కేంద్రం లాభాల్లో ఉన్న సంస్థలను అమ్మేస్తోందని విమర్శించారు. 12 ఏండ్లలో కేంద్రం ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు మహేశ్ కుమార్ గౌడ్. ఇందిగాంధీ నుంచి రాహుల్ వరకు పేదల కోసం పనిచేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమిత మయ్యారని అన్నారు. దోచుకున్న సొత్తులో వాటాల గొడవలతో ఆ పార్టీ రోడ్డున పడిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కు 100 సీట్లు గ్యారంటీ అని ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సమ్మిట్ తో 5 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయన్నారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని చెప్పారు.

## సంపాదకీయం

# ట్రంప్‌కు జ్ఞానోదయం అయ్యేనా?



పిల్లికి చెలగాటం..ఎలుకకు ప్రాణ సంకటం అన్న చందంగా ఇప్పుడు అమెరికా, ఇరాన్‌ల యుద్ధం తయారయ్యింది. ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..ఇరాన్ కోలుకోలేకుండా చేయడమే లక్ష్యంగా ట్రంప్ మూర్ఖంగా ముందుకు సాగుతున్నారు. ట్రంపం ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదు. ఇంటాబయటా నిరసనలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇకముందు ప్రపంచంలో ఇంధన కొరత తీవ్ర రూపం దాల్చడం ఖాయంగా కనిపిస్తుంది. ఇంధన కొరత అన్ని దేశాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీనిగురించి ట్రంప్‌కు పెద్దగా బెంగ లేదు. ప్రజలు ఏమయితే ఏమిటన్న ధోరణిలో ఆయన యుద్ధాన్ని ప్రేరేపించారు. ప్రపంచంలో ఏ దేశంలో ఏమి జరిగినా అది మన ఇంట్లో పొయ్యిలో పిల్లి లేవాలా వద్దా అన్నంత ప్రభావం చూపుతోంది. ఇప్పటికే మనదేశంలో హోటల్ పరిశ్రమ కుదేలయ్యింది. ఇలాగే యుద్ధం కొనసాగితే దాని ప్రభావం ఎన్నాళ్లు ఉంటుందో చెప్పలేం.ఎందుకంటే యుద్ధం మొదలు పెట్టి ఇరాన్÷–ను దెబ్బతీసినందుకు గాను ఇరాన్ కూడా గట్టిగానే ఎదురిస్తోంది. అంతు చూస్తామని అమెరికాను హెచ్చరిస్తోంది. తమకు నాలుగు వేల కిలోమీటర్ల దూరంలోని డిగో గార్షియా మీద ఇరాన్ చేసిన దాడిని తక్కువగా అంచనా వేయటం తగదని అమెరికా పూర్వ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్‌కు హితవు పలుకుతున్నాడంటే ఇక పైనైనా ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సిన ఆవశ్యకతను చెప్పడమే! అత్యంత అధునాతన ఎఫ్ 35 యుద్ధ విమానంపై ఇరాన్ దాడి చేసిందన్న వార్త ప్రపంచ దేశాలను ఉలికిపాటుకు గురిచేసింది. యుద్ధ తంత్ర నిపుణులు ఇరాన్ బలిమి లెక్కింపులో అమెరికా వ్యూహాన్ని తప్పుపట్టారు. తాజా వ్యూహంలో హర్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు సడలించేందుకు ట్రంపు నానా యాతన పడుతున్నారు. అది సాధ్యం కావడం లేదు. ఇరాన్ తో సత్సంబంధాలు నెరపుతున్న భారత్ వంటి దేశాల నౌకలకే సేఫ్ ప్యాసేజ్ లభించింది. అయినా ప్రపంచవ్యాప్తంగా ఉన్న చమురు సంక్షోభంలో భారత్ కూడా చిక్కుకోక తప్పడంలేదు. కొన్ని నౌకలు భారతీ–య పోర్టులకు చేరినా దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల కొరత బ్లాక్ మార్కెట్, రవాణా వాహనాలు చార్జీలు పెంపు వంటి అంశాల నుంచి ఎప్పటికి సాధారణ స్థాయికి చేరుకుంటుందో చెప్పలేం. హర్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు నుంచి తప్పించడానికి వెళ్తున్న యుద్ధ విమానాలకు శ్రీలంక అనుమతి నీయకపోవడంతో అమెరికా ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. హర్మూజ్ పై సైనిక చర్యకు ముందుకు రాని నాటో కూటమి దేశాలతో, తమ భద్రతను తామే ఏర్పాటు చేసుకోవాలని ట్రంప్ చేతులెత్తేశారు. ఆయన నిర్ణయాలకు మిత్ర దేశాల వత్తాసు లభించడం లేదు. ఇరాన్ వార్ కారణంగా ఖతార్ ఎల్ఎన్జి ఎగుమతులకు 5 ఏళ్ల పాటు దారి దొరికే పరిస్థితి లేదని తేలిపోయింది. ఇరాన్, అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం మానవ రహిత కార్యాచరణగా సాగుతోంది. కేవలం ఆయా దేశాల మౌలిక వనరుల విచ్ఛిత్తి పైనే దాడిగా చెప్పుకోవాలి. నెల రోజులుగా జరుగుతున్న యుద్ధాన్ని విశ్లేషిస్తున్న వారెవరైనా ఈ యుద్ధం ఆగేందుకు దారి లేదని, ఆపేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని వారి వైఖరులే స్పష్టపరుస్తున్నాయి. తాజాగా ఇరాన్ అమెరికా ఉద్రిక్తతలు హిందూ మహా సముద్రానికి విస్తరించాయి. అమెరికా వ్యూహాత్మక సైనిక స్థావరం డిగో గారియాను ఇరాన్ లక్ష్యం చేసుకోవడంతో అమెరికాలో కలవరం బయలుదేరింది. ఇరాన్ వద్ద ఇలాంటి శక్తివం తమైన బాంబులున్నట్లు అంచనా వేయడంలో అమెరికా దాదాపు విఫలమైనట్లే. ఇప్పుడు అమెరికా ఆత్మరక్షణలో పడిపోయింది. అయినా ట్రంప్ తన అహంకారాన్ని వీడడం లేదు. యురేనియం శుద్ధి చేసే సామర్థ్యం ఇరాన్‌కు లేదని, అలాగే బాలిస్టిక్ క్షిపణులు తయారు చేసే సామర్థ్యం కూడా లేకుండా చేసి తాము విజయం సాధించినట్లేనని ఈ మధ్యనే ఇజ్రాయిల్ ప్రధ్రాని బెంజి మెన్ నెతన్యాహూ ఒక సందర్భంలో సంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్‌ను అణ్వస్త్ర తయారీ వరకు వెళ్లకుండా చేయడమే తమ అంతిమ లక్ష్య మని అమెరికా ఇజ్రాయిల్ ప్రకటించుకున్నాయి. అదే నిజమైతే ఇప్పుడు వాళ్ళు ఆ దిశగా విజయం సాధించినట్లే. ఇజ్రాయిల్ లక్ష్యం అదే అయినప్పుడు మరికొంత కాలం యుద్ధాన్ని సాగతీయడం ఉభయులకూ, ఈ ప్రపంచానికీ మంచిది కాదు. టెహ్రాన్‌పై అమెరికా– ఇజ్రాయిల్ సంయుక్తంగా చేపట్టిన యుద్ధం 34వ రోజుకు చేరుకుంది. ఇరుదేశాల పరస్పర దాడుల వల్ల పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌పై అమెరికా జరిపే ఏ భూతల దాడినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగేర్ గాలిబాఫ్ ప్రకటించారు. ఇందుకోసం 7 మిలియన్ల ఇరానీయులు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. అమెరికాతో సంప్రదింపుల భాగస్వామిగా పేరు వినిపిస్తున్న మహమ్మద్ బఘేర్ ఖాలిబాఫ్, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికాకు సవాలు విసురుతూ వరుసగా ఆన్‌లైన్ పోస్టులు పెడుతున్నారు. అమెరికా– ఇజ్రాయిల్ తమపై అకారణంగా దాడులు చేస్తున్నాయని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడుల కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను తిరిగి పునరుద్ధరించడానికి నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకోసం దేశవ్యాప్త కార్యక్రమం చేపట్టాలని నిర్దేశించారు. అమెరికా– ఇజ్రాయిల్ తమ దేశంపై కొనసాగిస్తోన్న నీచమైన, దురాక్రమణ దాడులను మొజ్తాబా తీవ్రంగా ఖండించారు. ఇరాన్ అభివద్ధిని విస్తరించడం, ఉజ్వల భవిష్యత్తుకు ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొత్తంగా అమెరికాను ఎదిరించే సాహసం ఇరాన్ చేస్తోంది. ఇది అమెరికాకు ముఖ్యంగా ట్రంప్‌కు గుణపాఠం కావాలి.

# తీవ్రస్థాయిలో యుద్ధం

## పశ్చిమాసియాలో దాడులు.. మౌలిక సదుపాయాల విధ్వంసం

- ఇరాన్‌లోని ఎత్తయిన వంతెనను పేల్చేసిన అమెరికా
- 8 మంది మృతి.. 95 మందికి గాయాలుప్రతీకారంగా పశ్చిమాసియాలోని
- 8 భారీ వంతెనలను కూల్చేస్తామని ఇరాన్ ప్రకటన
- కువైట్ చమురు రిఫైనరీపై దాడి.. అబుధాబిలో క్షిపణి శకలాలు పడి ఐదుగురు భారతీయులకు గాయాలు
- మరో ఎఫ్-35ను కూల్చేశామన్న ఐఆర్‌జీసీ
- గాలింపు చేపట్టిన అమెరికా హెలికాప్టర్‌ను కూడా..!
- పైలట్లను ప్రాణాలతో పట్టిస్తే భారీ బహుమతి అంటూ ఇరాన్ స్థానిక అధికారుల ప్రకటన
- ఇరాన్ సైన్యం ఆధీనంలో ఒక పైలట్?
- బ్రిడ్జి పేల్చివేత అమెరికా నైతిక పతనానికి సాక్ష్యం
- దౌత్యానికి తలుపులు పూర్తిగా మూసుకున్నాయి
- ఇక చర్చలు ఉండవు: ఇరాన్ విదేశాంగ మంత్రి
- ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్కేంద్రాలు ధ్వంసం చేస్తాం
- హోర్ముజ్‌ను తెరిచి, చమురు స్వాధీనం చేసుకోగలం
- ఆలస్యం కాకముందే ఒప్పందానికి రావాలి: ట్రంప్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 :** పశ్చిమాసియాలో యుద్ధం మరింత ఉధృతం అవుతోంది. పౌర మౌలిక సదుపాయాలపైనా దాడులు జరుగుతున్నాయి. ఇరాన్‌లో వంతెనను అమెరికా పేల్చివేస్తే.. గల్ఫ్ దేశాల్లోని చమురు, విద్యుత్ ప్లాంట్లు, డీసాలినేషన్ వ్యవస్థలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. అటు అమెరికా యుద్ధ విమానాన్నీ కూల్చివేసింది. దాడులు చేయబోమంటూనే అమెరికా మోసానికి పాల్పడిందని ఇరాన్ ఆరోపిస్తే... ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్ ప్లాంట్లు ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌లోని టెహ్రాన్ నుంచి కరాజ్ ప్రాంతాన్ని కలిపే భారీ వంతెన 'బీ1 బ్రిడ్జ్'ను అమెరికా శుక్రవారం పేల్చివేసింది. ఆ పేలుళ్ల వీడియోను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. ఇంకా ఆలస్యం కాకముందే ఇరాన్ ఒప్పందానికి రావడం మంచిదని హెచ్చరించారు. నిర్మాణం పూర్తయ్యే దశలో ఉన్న ఈ వంతెన పశ్చిమాసియాలోనే ఎత్తయినదిగా చెబుతున్నారు. 446 అడుగుల (136 మీటర్ల) ఎత్తయిన ఈ వంతెనపై తొలుత వైమానిక దాడి చేసిన అమెరికా.. సహాయక చర్యలు కొనసాగుతున్న సమయంలో రెండో సారి బాంబులు వేసింది. ఆ సమయంలో వంతెనకు సమీపంలో పర్షియన్ కొత్త సంవత్సరం 'నౌరుజ్' వేడుకల ముగింపు కార్యక్రమం జరుగుతోంది. వందలాది మంది గుమిగూడి ఉన్నారు. దాడిలో వారిలో 8 మంది మృతిచెందగా.. 95 మందికిపైగా గాయపడినట్టు ఇరాన్ వెల్లడించింది. బ్రిడ్జి పేల్చివేత ఘటనపై తీవ్రస్థాయిలో మండిపడింది. దీనికి ప్రతీకారంగా పశ్చిమాసియాలోని ఎనిమిది భారీ, కీలక వంతెనలను పేల్చివేస్తామని ప్రకటించింది. కువైట్‌లోని షేక్ జబేర్ సీబ్రిడ్జి, యూఏఈలోని అల్ మఖ్తా, షేక్ ఖలీఫా, షేక్ జాయెద్ వంతెనలు, బహ్రెయిన్–సౌదీలను కలిపే కింగ్ ఫాహద్ కాజ్‌వే, జోర్డాన్‌లోని కింగ్ హుస్సేన్, దమియా, అబ్దౌన్ వంతెనలను కూల్చివేస్తామని హెచ్చరించింది.

### మరో ఎఫ్-35ను కూల్చేసిన ఇరాన్!

అమెరికాకు చెందిన మరో అత్యాధునిక స్టెల్త్ యుద్ధ విమానం ఎఫ్–35 లైట్నింగ్–2ను కూల్చివేసినట్టు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. గత 24 గంటల్లో ఇది రెండోదని, మొత్తంగా మూడో ఎఫ్–35ని అమెరికా నష్టపోయిందని పేర్కొంది. శుక్రవారం సెంట్రల్ ఇరాన్‌లోని కోహ్గిలుయే ప్రాంతంలో ఈ ఫైటర్ కూలిపోయి, భారీ పేలుళ్లు జరిగాయని తెలిపింది. అయితే అందులోని పైలట్లు ముందే ఎజెక్ట్ వ్యవస్థ ద్వారా బయటపడి నేలపై దిగారని.. వారి కోసం అమెరికా హెలికాప్టర్లు, సీ–130 హెర్క్యులస్ విమానాలు తక్కువ ఎత్తులో ఎగురుతూ గాలింపు చేపట్టాయని వెల్లడించింది. గాలింపు వీడియోలను కూడా విడుదల చేసింది. ఆ అమెరికన్ పైలట్‌ను ప్రాణాలతో పట్టిస్తే 'విలువైన బహుమతి' ఇస్తామని ఇరాన్ సైనికాధికారులు ప్రకటించారు. అయితే సదరు పైలట్లను ఇప్పటికే ఇరాన్ సైన్యం పట్టుకుందనే వార్తలూ వెలువడుతున్నాయి. ఇరాన్‌లో ఒక యుద్ధ విమానం కూలిపోయిందని, రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని అమెరికా రక్షణ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించినట్టుగా వాల్‌స్ట్రీట్ జర్నల్, సీఎన్ఎన్ తెలిపాయి. ఒక పైలట్‌ను గుర్తించి రక్షించారని వెల్లడించాయి. కూలిపోయినది ఎఫ్–15ఈ ఫైటర్ అయి ఉంటుందని.. ఎందుకంటే ఎఫ్–35లో ఒకరే పైలట్ ఉంటారని, ఎఫ్–15ఈలో ఇద్దరు పైలట్లు ఉంటారని విశ్లేషించాయి. కూలిపోయిన యుద్ధ విమానం శకలాలను, పైలట్లను గుర్తించేందుకు అమెరికా బ్లాక్ హాక్ హెలికాప్టర్, సీ–130 హెర్క్యులస్ విమానాలతో గాలింపు చేపట్టింది. ఈ క్రమంలో వాటిపైనా ఇరాన్ డ్రోన్లు, యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడిలో ఒక హెలికాప్టర్ కూలిపోయిందని ఇరాన్ మెహర్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది.

### కువైట్ చమురు రిఫైనరీపై దాడి

ట్రంప్ బెదిరింపు ప్రకటనలు, మౌలిక సదుపాయాలపైనా అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో.. ఇరాన్ కూడా భారీ స్థాయిలో దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాలపైకి క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. కువైట్‌లోని చమురు రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడులతో భారీగా మంటలు చెలరేగాయి. దానితోపాటు ఇరాన్ క్షిపణి దాడుల్లో ఒక విద్యుదుత్పత్తి కేంద్రం, సముద్రపు నీటిని మంచినీటిగా మార్చే డీసాలినేషన్ కేంద్రం దెబ్బతిన్నట్టు కువైట్ ప్రకటించింది. యూఏఈలో అతిపెద్దదైన 'హబ్షాన్ గ్యాస్ రిఫైనరీ'పై క్షిపణుల శకలాలు పడి, పేలుళ్లు జరిగాయని.. భారీగా మంటలు చెలరేగడంతో తాత్కాలికంగా ఉత్పత్తిని నిలిపివేశామని అబుధాబి మీడియా కేంద్రం ప్రకటించింది. యూఏఈలోని అబుధాబిలో క్షిపణుల శకలాలు పడి ఐదుగురు భారతీయులు సహా 12 మంది గాయపడ్డారు. ఒక నేపాలీ వ్యక్తి మృతిచెందారు. దుబాయ్‌లోని ఒరాకిల్, బహ్రెయిన్‌లోని అమెజాన్ ఐటీ సంస్థల డేటా సెంటర్లపై దాడులు చేశామని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ శుక్రవారం ప్రకటించింది. పశ్చిమాసియాలోని తమ శత్రుదేశాల టెక్ సంస్థలన్నీ లక్ష్యంగా చేసుకుంటామని పేర్కొంది. అయితే ఒరాకిల్ డేటా సెంటర్‌పై దాడి ఏమీ జరగలేదని, అది తప్పుడు వార్త అని దుబాయ్ పేర్కొంది. బహ్రెయిన్‌లోని తమ డేటా సెంటర్లపై దాడులు జరిగినట్టు అమెజాన్ వెబ్ సర్వీస్ ప్రతినిధులు వెల్లడించారు. ఇరాన్‌లోని బుషెహర్ ప్రావిన్స్‌లో ప్రజలకు మానవతా సాయం కింద సరుకులను తరలిస్తున్న రెండు కంటెయినర్లు, రెండు బస్సులు, పలు అత్యవసర వాహనాలు శుక్రవారం యూఎస్, ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైనట్టు రెడ్ క్రాస్/రెడ్‌క్రిసెంట్ సంస్థల ఫెడరేషన్ ప్రకటించింది. ఇజ్రాయెల్‌లోని జఫా ప్రాంతంపై పదుల సంఖ్యలో బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్టు యెమెన్‌లోని హౌతీ మిలిటరీ ప్రతినిధి యహ్యా సరీ వెల్లడించారు.

### చొరబాటుదారులు రాకుండా అడ్డుకుంటాం!

నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా నిషేధం విధిస్తాం

# భారత నేవీ అమ్ముల పొదిలోకి సరికొత్త అస్త్రం

## అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' జలప్రవేశం

## విశాఖలో ప్రారంభించిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**విశాఖపట్నం :** భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17–ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ,చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ (ఎనిటతిజీని ఔజీలా) వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ వార్‌షిప్ ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు. 149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువుండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు. ఇందులో నిశ్శబ్ద ఫిరంగులతో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్–8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది.అరిదమన్ అనేది ఒక పదం కాదని.. ఒక శక్తి అని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. భారత్ మూడో స్వదేశీ అణు సబ్‌మెరైన్ అరిదమన్ అని తెలిపారు. దీంతో సముద్ర ఆధారిత అణు నిరోధకశక్తి మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పని చేస్తున్న నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లెబోరెటరీ (ఎన్ఎస్‌టీఎల్)ను రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అందులోని కావిటేషన్ టన్నెల్‌కు సైతం ఆయన శంకుస్థాపన చేశారు. 2016లో ఐఎన్ఎస్ అరిహంత్, 2024 ఆగస్టులో ఐఎన్ఎస్ అరిఘాట్‌ల సరసన తాజాగా ఐఎన్ఎస్ అరిదమన్ చేరింది. అరిదమన్ చేరికతో.. అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములను సొంతంగా నిర్మించి, నిర్వహిస్తున్న అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వంటి ఎంపిక చేసిన దేశాల క్లబ్‌లో భారత్ చేరింది. ఈ జలాంతర్గాములు శత్రువుల కంటపడకుండా నెలల తరబడి సముద్రగర్భంలో ఉంటాయి. శత్రు దేశాల నుంచి అణు దాడి జరిగితే.. సముద్రం లోపలి నుంచే దీటుగా ఇవి బదులిస్తాయి.



చాటింపు
CHATIMPU Telugu Daily


## ఉప్పల్-నారపల్లి కారిడార్ పేరు...
# రాజకీయాలకు బలి కాకూడదు...

**ప్రజల భావోద్వేగాలపై జరుగుతున్న రాజకీయ ఆట...**
**అభివృద్ధికి రాజకీయ రంగు వేయొద్దు...**
**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.**




ఉప్పల్ ఏప్రిల్ 03(చాటింపు ప్రతినిధి) ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌కు దివంగత నేత బండారి రాజిరెడ్డి పేరు పెట్టడంపై మాజీ ఎమ్మెల్యే మీద విమర్శలు గుప్పించారు.కానీ ఇది కేవలం పేరు వివాదం కాదు... ప్రజల భావోద్వేగాలపై జరుగుతున్న రాజకీయ ఆట అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గ మండిపడ్డారు.ఇది ఒక పేరు కాదు నిలువెత్తు ఒక సేవా చరిత్ర కు నిలువెత్తు స్మారకం అని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా కాప్రా లో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.దాదాపు 150 కోట్ల తో సి.ఆర్ ఎం.పి నిధులతో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగింది అని ఆయన అన్నారు. మంత్రితో మాట్లాడి వర్క్ మంజూరు చేయడం జరిగింది అని ఆయన అన్నారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పై నిప్పులు చెరిగారు.ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి పేరు పెట్టడాన్ని మాజీ ఎమ్మెల్యే వ్యతిరేకించడం పట్ల తీవ్రంగా ఖండించారు. బండారి రాజిరెడ్డి మున్సిపల్ చైర్మన్ గా, ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు మెంబర్ గా ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి పనులు చేశారని పేర్కొన్నారు. ఆ సేవలకు గుర్తింపుగా ప్రజల కోరిక మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆయన పేరు పెట్టడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. వాజపేయి పేరును జాతీయ రహదారికి పెట్టాలని సూచించారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే అర్థరహితంగా మాట్లాడటం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని బండారి లక్ష్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మాకు బీజేపీపై ద్వేషం లేదు... దేశానికి సేవ చేసిన అటల్ బిహారీ వాజపేయి పట్ల అపారమైన గౌరవం ఉంది. అలాంటి మహానేత పేరు పెట్టాలంటే మేమే ముందుంటాం!" అని స్పష్టం చేశారు.అయితే వెంటనే గట్టిగాహెచ్చరించారు. "అందరూ మౌనంగా ఉన్నప్పుడు ఒక్కరే వ్యతిరేకించడం వెనుక ప్రజాహితం లేదు... రాజకీయ లాభాలే కనిపిస్తున్నాయి. ఇంకా తీవ్రంగా స్పందిస్తూ నేను ఎప్పుడూ అక్రమాలకు పాల్పడలేదు. నీలాగా పార్కులు కబ్జా నా రాజకీయాలు కావు... అంటూ బీజేపీ మాజీ ఎమ్మెల్యేపై ఘాటు విమర్శలు చేశారు. దివంగత బండారి రాజిరెడ్డి గురించి మాట్లాడుతూ ఎమ్మెల్యే గా వున్న సమయం లో స్వంత నిధులతో రోడ్లు వేయడం భవనాలు కట్టివ్వడం జరిగింది అని ఆయన అన్నారు. ప్రజల కోసం బ్రతికిన నాయకుడు... ప్రజల కోసం పోరాడిన మహానేత... అలాంటి వ్యక్తి పేరును వ్యతిరేకించడం అంటే ప్రజల మనసును అవమానించడం!" అని అన్నారు.అభివృద్ధికి రాజకీయ రంగు వేయొద్దు... ప్రజల భావోద్వేగాలతో ఆటలాడొద్దు! అధికారంలో ఉన్నా లేకపోయినా... ప్రజల కోసం నిధులు తీసుకురావడం మా బాధ్యత... మా పోరాటం ఆగదు...అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.

# రేవంత్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు

**రేవంత్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన కేరళం సీఎం పినరయి**



**తిరువనంతపురం, ఏప్రిల్ 3:** కేరళంలో ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేరళం సీఎం పినరయి విజయన్ ఘాటుగా స్పందించారు. తనపై, కేరళం అభివృద్ధి నమూనాపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవగాహన లేనివని, సత్యదూరమైనవని కొట్టిపారేశారు. రేవంత్ విమర్శలపై శుక్రవారం ఫేస్‌బుక్ పోస్టు ద్వారా స్పందించిన ఆయన.. కేరళం అభివృద్ధిపై రేవంత్‌రెడ్డి తప్పుడు సమాచారంతో మాట్లాడుతూ కేరళం ప్రజలను అవమానిస్తున్నారని ఆరోపించారు. తన రాష్ట్రంలో పేదల ఇళ్లను కూల్చివేయడం వంటి సమస్యలను పక్కనపెట్టి, కేరళంపై ఉపదేశాలు చేయడం సరైంది కాదని విమర్శించారు. కేరళం అభివృద్ధి నమూనా గురించి తెలుసుకోవడానికి ఇక్కడికి రావాలని ఆహ్వానించారు. కేరళం సుస్థిర, సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని చెప్పారు. కేరళంలో అవినీతి, పరిపాలనా వైఫల్యం ఉందని రేవంత్ చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. నీతి ఆయోగ్ సుస్థిరాభివృద్ధి సూచిక (2023-24)లో కేరళం మొదటి స్థానంలో ఉండగా, తెలంగాణ ఆరో స్థానంలో ఉందని తెలిపారు. కేరళంలో పేదరికం కేవలం 0.55 శాతమేనని, తెలంగాణలో అది 5.88 శాతంగా ఉందని చెప్పారు. అలాగే, కేరళం అక్షరాస్యత రేటు 95.3 శాతం కాగా, తెలంగాణలో అది 76.9 శాతం మాత్రమేనని పేర్కొన్నారు. శిశు మరణాల రేటు కేరళంలో 1000 జననాలకు 5 మాత్రమే ఉండగా, తెలంగాణలో అది దాదాపు నాలుగు రెట్లు ఎక్కువగా ఉందని అన్నారు. మెరుగైన ఆరోగ్య సదుపాయాలతో కేరళం ప్రజలు జాతీయ సగటు కంటే 5 నుంచి 7 సంవత్సరాలు ఎక్కువ కాలం జీవిస్తున్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కూడా విజయన్ విమర్శలు చేశారు. సొంత ప్రభుత్వంలో జీతాలు, పింఛన్లు ఆలస్యమవుతున్న పరిస్థితుల్లో, ఇతర రాష్ట్రాలపై విమర్శలు చేయడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. కాగా, అంతకుముందు కేరళంలో యూడీఎఫ్ అభ్యర్థుల తరపున ప్రచారం చేసిన రేవంత్‌రెడ్డి.. విజయన్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ, సీపీఎం మధ్య రహస్య ఒప్పందం ఉందని, అందుకే అవినీతికి పాల్పడిన సీపీఎం నాయకులను కేంద్ర దర్యాప్తు సంస్థలు వదిలేస్తున్నాయని ఆరోపించారు.

# పుదుచ్చేరిలో మోడీ భారీ రోడ్‌షో

**ఎన్‌డిఎ అభ్యర్థుల తరపున ప్రచారం**



**పుదుచ్చేరి :** జాతీయ ప్రజాస్వామ్య కూటమి ఎన్‌డిఎకు మద్దతు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుదుచ్చేరిలో శుక్రవారంనాడు భారీ రోడ్‌షో నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి, పాండిచ్చేరి హోం మంత్రి ఎ.నమశ్శివాయం సైతం ఈ రోడ్‌షోలో పాల్గొన్నారు. అజంతా సిగ్నల్ పాయింట్, కామరాజ్ విగ్రహం-రాజా థియేటర్ సిగ్నల్ మధ్య సుమారు రెండు కిలోమీటర్ల మేర గంటసేపు రోడ్‌షో జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనలు, సాంప్రదాయ నృత్యాలు ముందుకు సాగగా, బీజేపీ కార్యకర్తలు, అల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ (ఏఐఎన్‌ఆర్‌స్) కార్యకర్తలు పార్టీ జెండాలతో పెద్దఎత్తున పాల్గొన్నారు. దీనికి ముందు, పుదుచ్చేరి చేరుకున్న ప్రధానమంత్రికి బీజేపీ మద్దతుదారులు ఘనస్వాగతం పలికారు. 'జైశ్రీరామ్' 'భారత్ మాతా కీ జై' నినాదులు హోరెత్తించారు. ప్రధాన కాన్వాయ్‌పై పూలజల్లులు కురిపించారు. పుదుచ్చేరిలో ఎఐఎన్‌ఆర్‌సీ-బీజేపీ కూటమి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు విస్తృత ప్రచారం సాగిస్తున్న తరుణంలో మోదీ రోడ్‌షోతో ప్రచారం మరింత ఊపందుకుంది. ఇటీవల పుదుచ్చేరి బీజేపీ కార్యకర్తలతో వర్చువల్ షోలోనూ మోదీ పాల్గొని వారిని మరింత ఉత్సాహపరిచారు. ఈ ఎన్నికల్లో సీట్ల పంపకాల్లో భాగంగా ఏఐఎన్‌ఆర్‌సీ 16 స్థానాల్లోనూ, బీజేపీ 10 స్థానాల్లోనూ పోటీ చేస్తున్నాయి. కూటమిలో ఇతర భాగస్వాములుగా ఉన్న అన్నాడీఎంకే, లాట్చియ జననాయగ కట్చి (ఎల్‌జేకే) చెరో రెండు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. పుదుచ్చేరి అసెంబ్లీకి ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# దొడ్డి కొమరయ్య విగ్రహక ఆవిష్కరణలో ఎంపీ ఈటల....



ఎల్.బి నగర్ ఏప్రిల్03 (చాటింపు ప్రతినిధి) : ఎల్బీ నగర్ లో దొడ్డి కొమరయ్య విగ్రహక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్ 99వ దొడ్డి కొమరయ్య జయంతిని పురస్కరించుకొని.ఎల్బీనగర్లో విగ్రహాన్ని ఆవిష్కరించుకొని, సభను ఏర్పాటు చేసిన వెంకటేష్ కి ప్రత్యేకధన్యవాదములు. ఏ కులమైన, ఏ జాతైనా తన గొప్పతనాన్ని, త్యాగాలను పరిచయం చేసుకోకపోతే రాబోయే తరాలకు తెలిసే ఆస్కారం ఉండదు. దోపిడి, అణచివేతకు వ్యతిరేకంగా ఆనాటి నిజాం కు ఎదురు వెళ్లి వారి తూటాలకు నేలకొరిగిన మహనీయుడు దొడ్డు కొమురయ్య .మన సంస్కృతిని,సాంప్రదాయాలను వెలుగెత్తి చాటిన మహనీయుడు చుక్క సత్తన్న. చుక్క సత్తన్న చెప్తుంటే అన్ని కులాల వారు, వారి కథలు వినేవారు. రోజులు మారుతున్న కూడా ఇంకా ఆ బట్టలని, సంస్కృతిని, సంప్రదాయాన్ని గౌరవించుకుంటున్న జాతి కురుమ జాతి. ఇలానే మరింత ఐక్యత, పట్టుదలతో ముందుకు పోవాలని మనస్ఫూర్తిగాకోరుకుంటున్నాను.ఈ కార్యక్రమంలో సామ రంగారెడ్డి, జాజుల శ్రీనివాస్ గౌడ్ గారు, కొప్పుల నరసింహారెడ్డి, శ్యామ్, ఆదికృష్ణ, వెంకన్న, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సేవలో మధుర చారిటబుల్ ట్రస్ట్ 25 సంవత్సరాలు పూర్తి....

**చలివేంద్రాన్ని ప్రారంభించిన రాగిడి లక్ష్మారెడ్డి ..**




ఉప్పల్ ఏప్రిల్03(చాటింపు ప్రతినిధి) : సామాజిక సేవలో మధుర చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఉ చైర్మన్ మల్కాజ్గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి రామంతపూర్ లో మధురా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మధురా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ రాగిడి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభించడం జరిగినది. చలివేంద్రాన్ని ప్రారంభించిన రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.... మా ఈ మధుర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గత 25 సంవత్సరాల నుండి ఎన్నో సేవా కార్యక్రమాలు ఉప్పల్ నియోజకవర్గంలో చేపడుతూ.... మరి ముఖ్యంగా ఈ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మరియు మధురా చారిటబుల్ ట్రస్ట్ మెంబర్స్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న బండి రమేష్...



కూకట్ పల్లి ఏప్రిల్ 03(చాటింపు ప్రతినిధి) : శ్రీ హనుమాన్ జయంతి కార్యక్రమం కూకట్పల్లి నియోజకవర్గం లో గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి కాలనీలోను హనుమాన్ శోభాయాత్రను భక్తులు ఘనంగా నిర్వహించారు. కెపిహెచ్బి కాలనీ రమ్య గ్రౌండ్ వద్ద రామసేన కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధి ప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శోభా యాత్రకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తండ్రి మాటని చెవదాటని జవదాటని శ్రీరాముడు పితృ వాక్య పరిపాలకుడు అని అలాంటి రాముడి సేవకుడిగా హనుమంతుడి సేవలు అందరికీ అనుసరణీయ మనీ ఈ సందర్భంగా రమేష్ గారు పేర్కొన్నారు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ ,సాయిబాబా చౌదరి, అరవింద్ రెడ్డి , రంగమోహన్, శ్రీనివాస్ బాబు, చావా శ్రీనివాస్, గంధంరాజు ,గోపాల్ చౌదరి ,ఫణిందర్ ,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి తత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాలి : వడ్డేపల్లి.



మూసాపేట్ ఏప్రిల్03 ( చాటింపు ప్రతినిధి) : మూసాపేట్ డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు ఐలయ్య యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని మూసాపేట్ ఎల్లమ్మ ఆలయం ప్రాంగణంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో బిజెపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఐలయ్య యాదవ్ ని శాలువాతో సన్మానించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుండే ఐలయ్య యాదవ్ బిజెపి తత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావం మరింత మంది కార్యకర్తలకు ప్రేరణ. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న శ్రద్ధ ప్రశంసనీయం. భవిష్యత్తులోనూ ఆయన్ను దేవుడు మంచి ఆరోగ్యం ప్రసాదించి మరెన్నో సేవా కార్యక్రమాలు చేయడానికి శక్తిని ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని రాజేశ్వర రావు తెలియజేశారు

# ఉమ్మడి పౌరస్మృతితో చొరబాటు దారులకు చెక్

**వారు ఇక్కడ నాలుగేసి పెళ్లిళ్లు చేసుకోకుండా అడ్డుకట్ట**

**అసోం ఎన్నికల ప్రచారంలో అమిత్ షా**



**గువాహటి:** చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి తో అడ్డుకునే వీలుంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. అస్సాంలోని గోల్‌పాడాలో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమిత్‌షా మాట్లాడుతూ, తిరిగి తాము అధికారంలోకి వస్తే అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. గిరిజనాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సమగ్ర మ్యాప్ సిద్ధం చేశారని అమిత్‌షా తెలిపారు. దీనిని ముందుకు తీసుకువెళ్లి, సమర్థవంతంగా అమలు చేయాలంటే బీజేపీకే ప్రజలు ఓటు వేయాలని కోరారు. మోదీ నాయకత్వంలో తొలిసారి గిరిజన మహిళ దేశ అధ్యక్షురాలు అయిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ ఆదివాసీ మహిళలను రాష్ట్రపతి చేయలేదని, మోదీ వచ్చాక పరిస్థితి మారిందని, ద్రౌపది ముర్ము దేశానికి తొలి పౌరురాలు అయ్యారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. యూసీసీ నుంచి ఆదివాసీ ప్రాంతాలను మినహాయిస్తామని చెప్పారు. పొరుగున్న ఉన్న మేఘాలయాలో చొరబాటుదారులు ఇటీవల గరో హిల్స్ అటానమస్ జిల్లా కౌన్సిల్‌లో గిరిజన మహిళలను పెళ్లాడి రాజకీయ పలుకుబడిని సంపాదించే ప్రయత్నం చేశారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని అమిత్‌షా చెప్పారు. అస్సాంలో తమకు మరో ఐదేళ్లు అధికారం ఇస్తే యూజీసీని అమలు చేయడంతో పాటు చొరబాటుదారుల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అస్సాంలో శాంతిని బీజేపీ పునరుద్ధరించిందని, కాంగ్రెస్ తిరిగి వచ్చినా, కొన్ని సీట్లలో నెగ్గినా కూడా తిరిగి రాష్ట్రంలో అస్థిరత నెలకొంటుందని హెచ్చరించారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# డైయిరీ ,పాడి పరిశ్రమ అభివృద్ధి పై సిఎం రేవంత్ రెడ్డినీ కలిసిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య..



హైద్రాబాద్ ఏప్రిల్ 03 (చాటింపు ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని హైదరాబాద్ లోని జూబ్లీ హిల్స్ లోని ఆయన నివాసంలో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్( ఎన్ డి డి బి )చైర్మన్ డాక్టర్ మీనేష్ షా, మదర్ డైయిరీ ఢిల్లీ చైర్మన్ జయతీర్థా చారి తో కలసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పాడి పరిశ్రామిభివృద్ధి పైన చర్చించారు.రాష్ట్రంలో మదర్ డైయిరీ ,పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం పాలు ఉత్పత్తి పెంపు, రైతులకు ప్రోత్సాహకాలు, మదర్ డెయిరీ మౌలిక వసతుల విస్తరణ, సహకార సంఘాల బలోపేతం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. అలాగే డెయిరీ రంగంలో పెట్టుబడులు పెంచడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడంపై కూడా దృష్టి సారించారు. ఈ సమావేశంలో భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి , ప్రిన్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి , మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో ఘనంగా యువనేత పచ్చిమట్ల మనోజ్ గౌడ్ జన్మదిన వేడుకలు

## మనోజ్ గౌడ్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు , విఐపి లు



యాదగిరిగుట్ట , ఏప్రిల్ 3 ( చాటింపు ప్రతినిధి ) : పేద ప్రజల శ్రేయస్సు కోసం , ప్రజాసేవకు అంకితమై పని చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పచ్చిమట్ల మనోజ్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా యాదగిరిగుట్టలో వివిధ ప్రాంతాలలో ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పచ్చిమట్ల మనోజ్ గౌడ్ కు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, విఐపి లు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు పచ్చిమట్ల మనోజ్ గౌడ్ జన్మదిన వేడుకలను ఆయా ప్రాంతాలలో జరిపారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం, విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ తదితర అనేక సంక్షేమ , సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాలకు హాజరైన పచ్చిమట్ల మనోజ్ గౌడ్ మాట్లాడుతూ ప్రజా సేవతోనే తృప్తి ఉంటుందని అన్నారు. ప్రజల కోసం, సామాజిక అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ప్రజాబలం ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చుని అన్నారు. తనపై ఇంత అభిమానం చూపుతున్న అభిమానులు , స్నేహితులు నాయకులు, కార్యకర్తలకు ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని అన్నారు . ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు మిత్రులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలు మనోజ్ గౌడ్ ను శాలువాలు , పూలమాలలతో ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పుట్టినరోజు వేడుకల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాదునేని మధుకర్, బందారపు బిక్షపతి గౌడ్, కౌకుంట్ల బాల్ రెడ్డి, గుండు నరసింహ గౌడ్ , మొలుగు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా మహనీయుల వేడుకలకు సన్నాహాలు

**బాబు జగ్జీవన్ రావ్, డా. బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు..**

**మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్న ప్రజా ప్రభుత్వం...**

**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.**



హైదరాబాద్, ఏప్రిల్ 03 (చాటింపు ప్రతినిధి) : దేశ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావ్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ల జయంతి వేడుకలను ఈనెల 5, 14 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వద్ద ఇందుకు సంబంధించి వివిధ దళిత సంఘాల నాయకులు, కళాకారులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ఉండేలా తీసుకోవాల్సిన చర్యలు, విగ్రహాల వద్ద కార్యక్రమాల రూపకల్పన, ప్రజల సౌకర్యాలపై సమగ్రంగా చర్చించారు.అనంతరం మీడియాతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందని మంత్రి తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశానికి పరిష్కారం చూపడం ద్వారా ప్రతి వర్గానికి న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తీసుకున్న నిర్ణయాలు సామాజిక న్యాయానికి బలమైన పునాది వేస్తున్నాయని అన్నారు.బాబు జగ్జీవన్ రావ్ దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ.... ఒక పేద కుటుంబం నుంచి ఎదిగి దేశ ఉప ప్రధానిగా కీలక బాధ్యతలు నిర్వహించి వ్యవసాయం, రక్షణ రంగాల్లో దేశాన్ని బలోపేతం చేసిన మహనీయుడిగా కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కృషి తరతరాలకు ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. అలాగే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి గురించి మాట్లాడుతూ... భారత రాజ్యాంగాన్ని నిర్మించడం ద్వారా దేశ ప్రజాస్వామ్యానికి శాశ్వత దిశానిర్దేశం చేసిన మహానుభావుడని పేర్కొన్నారు. సమాన హక్కులు, సామాజిక న్యాయం, స్వాభిమాన జీవనానికి ఆయన చూపిన మార్గం దేశానికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. విద్య, చైతన్యం ద్వారా అణగారిన వర్గాలను ముందుకు తీసుకురావాలనే ఆయన ఆశయాలను ప్రభుత్వం కార్యరూపంలోకి తీసుకువస్తోందని తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, డాక్టర్ వివేక్, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారని మంత్రి తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఈ మహా వేడుకల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ సిడి డి ఏడి శ్రీధర్, శ్రీనివాస్ రెడ్డి లతో పాటు దళిత సంఘాల నాయకులు..డి సుదర్శన్ బాబు సి.ఓ చైర్మన్.. డాక్టర్ అల్లిబిల్లి మహేందర్,సి ఓ చైర్మన్. బైరి వెంకటేష్, తాలూకా అనిల్,మేతరి రోజా రాణి,బైండ్ల శ్రీనివాస్. గంట సుదర్శన్. వైస్ చైర్ మెయిన్ లు , మాజీ చైర్మన్లు టిఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇటిక రాజు.. తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు జన్ను కనకరాజు, దండు సురేందర్ మాదిగ, మాల మహానాడు చెన్నయ్య , జాతీయ అధ్యక్షులు. మేడి పాపయ్య,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు. జి నాగేష్,గుంటి విజయ్ బాబు, ఎం వినోద్ కుమార్,మాస్టర్ జి, మాది హక్కుల దండోరా రాజేందర్, కృష్ణ. సనాదం. షామ్లెట్ నర్సింగరావు,కురుమ మహేందర్, రాపాక అశోక్, దేశపాక గోవర్ధన్, స్టాలిన్ కృష్ణవేణి, పోలేపాక జ్యోతి, విజయ, శంకర్, మొద్దు రేణుక, మిడ్ల మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

# డి సి సి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఏనుగు జలేందర్ రెడ్డి

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాను..ఏనుగు జలేందర్ రెడ్డి.



మేడిపల్లి ఏప్రిల్ 03 (చాటింపు ప్రతినిధి) మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డి సి సి) ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఏనుగు జలేందర్ రెడ్డి , పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆర్.వి. ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి తో కలిసి ఈరోజు జిల్లాలోని పలువురు నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి తన నియామకానికి సహకరించిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా డీసీసీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి వజ్రేష్ యాదవ్ ని, మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుదీర్ రెడ్డి ని,రేవంతన్న వ్యక్తి గత పరిశీలకులు అనిల్ కుమార్ రెడ్డిని,మాజీ డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డిని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ ని , అంజిరెడ్డిని కలిసి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన ఈ నూతన బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తానని, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని జలేందర్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో డీసీసీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ , డీసీసీ ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి,ఆర్ టి ఐ మెంబర్ జైపాల్ రెడ్డి,బొమ్మక్ శ్రీనివాస్, బండి శ్రీరాములు,సురేష్ నాయక్,సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలి

## లేదంటే గాంధీ భవన్ లో నిరహార దీక్ష చేస్తాం...

## జాతీయ అధ్యక్షులు మేకల రాములు.



ఖాజీపేట ఏప్రిల్ 03 (చాటింపు ప్రతినిధి) : శుక్రవారం రోజున ఖాజీపేట మీడియా పాయింట్ లో వరంగల్ జిల్లాగొర్రెల సహకార సంఘం చైర్మన్ మేకల కేదారి యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములు హాజరు అయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్రం లో 20% వున్న యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలని , 5కోట్ల తో యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు, గొర్రెలు,మేకల సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చైర్మన్ ను నియమించాలని తెలియజేశారు, ఈ నెల 12వ తేదీ వరకు ప్రభుత్వం నుంచి ఏ స్పందన రాకపోతే హైదరాబాద్ గాంధీ భవన్ లో ఆమరణ నిరాహారదీక్షను చేపడతామని ప్రభుత్వాని హెచ్చరిస్తునమని అన్నారు, ఈ సందర్భంగా తోటకూరి రాజు యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున వారి మేనిఫెస్టో లో వున్న గొర్రెల పంపిణీ స్కీమ్ ను తిరిగి అమలు చేయలేదని, గత ప్రభుత్వం లో జరిగిన స్కామ్ ను పక్కదోవ పట్టించిన వారి పై ఎలాంటి చర్యలు చేపటలేదని అన్నారు, ఈ కార్యక్రమంలో దాడబోయిన మీరస్వామి యాదవ్, పెద్దికాసు నాగరాజు, కుమారస్వామి యాదవ్, రమేష్ యాదవ్, రాజు యాదవ్, ఆర్యల కుమారస్వామి యాదవ్ తదితర యాదవ సంఘ నాయకులు పాల్గొనారు.

# చర్లపల్లిలో ఘనంగా 'శ్రీరామ్ రెస్టారెంట్' ప్రారంభం

## ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం.



కుషాయిగూడ ఏప్రిల్03 (చాటింపు ప్రతినిధి) : చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతం మరో నూతన ఆహార కేంద్రంతో కాంతివంతమైంది. చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో ప్రముఖ వ్యాపారవేత్త, శ్రీరామ్ బేకరీ అధినేత విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్మితమైన 'శ్రీరామ్ రెస్టారెంట్' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి రిబ్బన్ కట్ చేసి రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ప్రారంభోత్సవ వేడుకలు ఉత్సాహభరితంగా, ఘనంగా సాగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పారిశ్రామిక ప్రాంతాల్లో ఇలాంటి నాణ్యమైన రెస్టారెంట్లు అవసరమని, కార్మికులు మరియు స్థానిక ప్రజలకు పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారం అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ వేడుకకు మాజీ హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్,

మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింలు, మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి యాదవ్, రిటైర్డ్ ఏసీపీ గణేష్ రెడ్డి, కొత్త రామారావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, సాయి జెన్ శేఖర్, డివిజన్ అధ్యక్షుడు నేమురి మహేష్ గౌడ్, మురళి పంతులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సీతారాం రెడ్డి, సింగిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అతిథులు ఈ సందర్భంగా విజయ్ కుమార్ రెడ్డికి కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ ప్రతిమను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ రెస్టారెంట్ ద్వారా ప్రాంత ప్రజలకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని ఆకాంక్షించారు.

# క్యాతనపల్లి ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

## ....ఏసీపీ కిరణ్ కుమార్.



బెల్లంపల్లి ఏప్రిల్ 03 (చాటింపు ప్రతినిధి) క్యాతనపల్లి మున్సిపాలిటీలో శనివారం జరగనున్న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మొత్తం 485 మంది పోలీసు సిబ్బందితో పాటు ప్రత్యేక బలగాలను మోహరించినట్లు వెల్లడించారు. విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే డ్యూటీ సమయంలో నిర్లక్ష్యం చేయకుండా, ఉన్నతాధికారుల ఆదేశాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించి ఎన్నికలు సజావుగా జరిగేలా చేయాలని ఏసీపీ విజ్ఞప్తి చేశారు.

# నాడు అటెండర్.. నేడు తహశీల్దార్

## 30 ఏళ్ల కిందట అటెండర్‌గా బాధ్యతలు... నేడు తహశీల్దార్‌గా సేవలు

## పట్టుదలతో విద్యా అర్హతలు పెంచుకొని ఆదర్శం సూరయ్య ఉద్యోగ ప్రస్థానం

నడిగూడెం ఏప్రిల్ 03 (చాటింపు ప్రతినిధి ) : ఒకప్పుడు అదే కార్యాలయంలో అధికారులు చెప్పిన పనులు చేయడం ఆయన విధి. నేడు అదే కార్యాలయంలో ఉన్నతాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యం అని నిరూపించారు సోమపంగు సూరయ్య . 30 ఏళ్ల తర్వాత తాను అటెండర్ గా ఉ ద్యోగ జీవితం ప్రారంభించిన చోటే కార్యాలయానికి బాసుగా నియమితులై ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. తొలుత అటెండర్ గా బాధ్యతలు చేపట్టి అంతటితో ఆగకుండా పట్టుదలతో విద్యా అర్హతలు పెంచుకుంటూ అంచెలంచెలుగా ఎదిగారు. నేడు అదే కార్యాలయంలో తాహశీల్దార్ గా బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం రాఘవపురం గ్రామానికి చెందిన సోమపొంగు భద్రయ్యకు ఏడుగురు సంతానంలో సూరయ్య మూడో వ్యక్తి. 1995 సంవత్సరంలో నడిగూడెం తహశీల్దార్ కార్యాలయంలో అటెండర్ గా పనిచేసిన సోమపొంగు భద్రయ్య అనారోగ్య కారణాలతో వలంటరి రిటైర్మెంట్ పొందారు. కారుణ్య నియామకంలో తండ్రి ఉద్యోగాన్ని సూరయ్య పొంది 1995 జూన్




26 నుంచి 2000 సంవత్సరం వరకు కొనసాగారు. 2000 నుంచి 2002 వరకు మునగాల మండల ఎమ్మార్వో ఆఫీస్ లో అటెండర్ గా, అక్కడినుంచి తిరిగి నడిగూడెం తహశీల్దార్ కార్యాలయంలో 2006 వరకు పనిచేశారు. 2006లో పదోన్నతి పొంది మఠంపల్లి మండల తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా విధుల్లో చేరారు. రెండు సంవత్సరాలు పనిచేసిన అనంతరం 2008 లో నడిగూడెం కార్యాలయానికి సీనియర్ అసిస్టెంట్ గా బదిలీపై వచ్చారు. 2010లో ఉమ్మడి మేళ్ల చెరువు మండలానికి ఆర్ ఐ గా ప్రమోషన్ పై వెళ్లారు. 2012లో మట్టంపల్లి ఆర్‌ఐగా 2013లో నడిగూడెం ఆర్ ఐగా పని చేశారు. అదేవిధంగా 2014, 15, 16 మండలంలో సీనియర్ అసిస్టెంట్గా పనిచేశారు. 2017 సెప్టెంబర్ లో మఠంపల్లి డిప్యూటీ తహశీల్దార్ గా ఉద్యోగన్నతి పొంది బదిలీ అయ్యారు. 2018 కోదాడ మండల ఎలక్షన్ డ్యూటీ గా, రెగ్యులర్ డీటీగా రెండు సంవత్సరాల పాటు పనిచేసిన ఆయన 2021 లో చింతలపాలెం లో 11 నెలల పాటు ఇన్చార్జి తహశీల్దార్ గా విధులు నిర్వహించారు. 2022- 24 మూడు సంవత్సరాల పాటు మోతే మండల డిప్యూటీ తహశీల్దార్ గా పనిచేసి 2024 జూలైలో మరల కోదాడ తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ గా బాధ్యతలు చేపట్టారు. అక్కడినుంచి 2026 జనవరి 8న చింతలపాలెం మండల ఎఫ్ఏసి తహశీల్దార్ గా పనిచేసి తాజాగా మార్చి 31న నడిగూడెం మండల ఎఫ్ఎసి తహశీల్దార్ గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

ఇదే కార్యాలయంలో 30 ల క్రితం అటెండర్ గా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించామని తిరిగి ఈ కార్యాలయానికి తహశీల్దార్ గా రావడం చాలా ఆనందంగా ఉందని సూరయ్య తెలిపారు. సూరయ్య ఇద్దరు ఆడపిల్లలు పెద్ద కూతురు గ్రూప్ కి ప్రిపేర్ అవుతుండగా, చిన్న కూతురు హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. అటెండర్ గా పనిచేసిన కార్యాలయంలో ఒక్కరోజైనా తహశీల్దారుగా పనిచేయాలని తన జీవిత లక్ష్యం నెరవేర్చినందుకు జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందుకు సహకరించిన కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు.

# యాజమాన్యం హామీతో జీడీకే -11 పిట్ నిరసన దీక్ష తాత్కాలిక వాయిదా



గోదావరిఖని ఏప్రిల్ 03 (చాటింపు ప్రతినిధి) జీడీకే-11 ఇంక్లైన్‌లో కార్మికుల మౌలిక సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షను యాజమాన్యం హామీతో తాత్కాలికంగా వాయిదా వేసినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి తెలిపారు. గత రెండు నెలలుగా సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పోరాటం చేస్తున్నప్పటికీ స్పందన లేకపోవడంతో సిఐటియు నిరసన దీక్షకు పూనుకుంది. దీక్షకు కార్మికులు, ఇతర సంఘాల మద్దతు పెరగడంతో యాజమాన్యం చర్చలకు దిగింది. సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో దీక్షను తాత్కాలికంగా విరమించినట్లు తెలిపారు. సిఐటియు పోరాటానికి మద్దతుగా నిలిచిన అన్ని కార్మిక సంఘాలు, కార్మిక సోదర సోదరీమణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏజెంట్ల మాటలు నమ్మొద్దు

## ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ హెచ్చరిక.




పెద్దపల్లి ఏప్రిల్ 03 (చాటింపు ప్రతినిధి) : తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేయిస్తామని చెప్పే ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని పెద్దపల్లి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్ ప్రజలను హెచ్చరించారు. జిల్లా స్థాయిలో ఎలాంటి బిల్లులు మంజూరు కావని స్పష్టం చేసిన ఆయన, డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా చెప్పినా నమ్మవద్దని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు వారధి సొసైటీ ద్వారా, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోనే భర్తీ అవుతాయని పేర్కొన్నారు. ఉద్యోగ ఆశావహులు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లోని వారధి కార్యాలయంలో నమోదు చేసుకుంటే, అవకాశాలు ఉన్నప్పుడు సమాచారం అందిస్తామని చెప్పారు. ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని తెలిపారు.

# జవహర్‌నగర్‌లో దొడ్డి కొమురయ్య జయంతి ఘనంగా నిర్వహణ...

## పోరాట స్ఫూర్తిని స్మరించిన ప్రజలు.



జవహర్ నగర్ ఏప్రిల్ 03 (చాటింపు ప్రతినిధి) తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన అమర వీరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా జవహర్ నగర్‌లో మహనీయుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. పోరాట వీరుని జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ వేడుకలు ప్రాంతమంతటా ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించాయి. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, యువత, నాయకులు భారీగా హాజరై కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం ప్రాణత్యాగం చేసిన ధీరుడు"గా కొమురయ్యను కొనియాడుతూ పలువురు నాయకులు ఆయన త్యాగస్ఫూర్తిని స్మరించారు. నిజాం నిరంకుశ పాలనకు ఎదురు నిలిచి రైతాంగానికి న్యాయం సాధించేందుకు పోరాడిన తొలి అమరుడిగా ఆయన చరిత్రలో చిరస్మరణీయుడిగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, "దొడ్డి కొమురయ్య చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమై, సమాజంలో అన్యాయాలకు ఎదురు నిలిచే ధైర్యాన్ని కలిగిస్తుంది" అని పేర్కొన్నారు. యువత ఆయన త్యాగస్ఫూర్తిని అలవరచుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. మహనీయుల కమిటీ అధ్యక్షులు మండల సురేందర్ మాట్లాడుతూ, జవహర్ నగర్‌లో మహనీయుల స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా మరిన్ని మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కమిటీ సంకల్పించిందని తెలిపారు. ఈ క్రమంలో భారతదేశ తొలి సామాజిక సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఈ నెల 10వ తేదీన ఘనంగా ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రులు, రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరవుతారని తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ, రైతాంగ పోరాట తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య జయంతిని ఘనంగా నిర్వహించిన మహనీయుల కమిటీని అభినందించారు. సమాజంలో సమానత్వం, న్యాయం కోసం పోరాడిన మహానుభావుల జ్ఞాపకాలను సజీవంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహనీయుల కమిటీ సభ్యులు మండల సురేందర్, పర్శరాములు, తూటి శ్రీనివాస్, మహేందర్, మాజీ మేయర్ శాంతి కోటేష్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, కార్పొరేటర్లు ఆలూరి సంగీత రాజశేఖర్, శారద మనోహర్ రెడ్డి, పల్లపు రవి, మాజీ సర్పంచ్ జ్యోతి శంకర్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జినుక సాయిలు, కొండల్ ముదిరాజ్, ఎల్ల స్వామి, కొమురయ్య, వేణు, కొయ్యడ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ప్రాణాలకు అండగా సీఎంఆర్ఎఫ్

## ఉప్పల్‌లో లక్షల రూపాయల సహాయం పంపిణీ.

## ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి.



ఉప్పల్ ఏప్రిల్ 03 (చాటింపు ప్రతినిధి) : ఆర్థిక ఇబ్బందులతో చికిత్సకు నోచుకోలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆశాకిరణంగా నిలుస్తున్న సీఎంఆర్ఎఫ్ పథకం నిజమైన ప్రాణాధారంగా మారిందని ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. అత్యవసర వైద్య ఖర్చుల సమయంలో ప్రజలకు తక్షణ సహాయం అందిస్తూ, ఈ పథకం వేలాది కుటుంబాలను కాపాడుతోందన్నారు. ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డిహమాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుని, అర్హులందరికీ సీఎంఆర్ఎఫ్ కింద మెడికల్ బిల్లులను వేగంగా మంజూరు చేస్తోందని వివరించారు. "డబ్బుల్లేక చికిత్స ఆగిపోకూడదు... ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుంది" అనే సంకల్పంతో ఈ పథకం సమర్థంగా అమలవుతోందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు పంపిణీ చేసిన చెక్కుల వివరాలు ఇలా ఉన్నాయి సత్యం -- ₹1,30,000 రాజేంద్ర ప్రసాద్ --₹60,000 ఆఫ్రీనా సుల్తానా -- ₹20,000 దిరావత్ బాలాజీ --₹39,000 శాలిని -- ₹35,000 సొంటి రెడ్డి గాల్ రెడ్డి -- ₹32,000 సాత్విక్ రెడ్డి -- ₹40,000 చౌదర్పల్లి పద్మ -- ₹23,000 చెక్కులు అందుకున్న లబ్ధిదారులు భావోద్వేగంతో స్పందిస్తూ, అత్యవసర సమయంలో అందిన ఈ ఆర్థిక సహాయం తమకు ఎంతో ఊరటనిచ్చిందని తెలిపారు. ప్రభుత్వం మరియు పరమేశ్వర్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విట్టల్ నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆకిటి ఆగం రెడ్డి, బజార్ జగన్నాథ్ గౌడ్, సల్ల ప్రభాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గడ్డం యాదగిరి, ప్రకాశ్ రెడ్డి, పాసిగంటి నాగరాజు, షరుఫుద్దీన్, ఉమా, మంచాల రఘు, రత్నారెడ్డి, రంగుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఆరోగ్య సంక్షోభాల్లో అండగా నిలుస్తున్న ప్రభుత్వం -- సీఎంఆర్ఎఫ్‌తో వేల కుటుంబాలకు కొత్త జీవం.

# అభివృద్ధి పనులు వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలి

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ముత్తారం/మంథని ఏప్రిల్ 03 (చాటింపు ప్రతినిధి) : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు సమయానికి, నాణ్యతతో పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం ముత్తారం మండలం దర్యాపూర్ గ్రామంలోని ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు, మంథని పట్టణంలోని అయ్యగారి చెరువు రీ-మోడలింగ్ పనులను ఆయన పరిశీలించారు.

దర్యాపూర్ మోడల్ స్కూల్‌లో రూ.1 కోటి నిధులతో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్. ఆమోదించిన పనులను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అదనపు పనులకు అవసరమైన అంచనాలను వెంటనే సమర్పించాలని తెలిపారు. అనంతరం అయ్యగారి చెరువు రీ-మోడలింగ్ పనులను పరిశీలించిన ఆయన, పనులను వెంటనే ప్రారంభించి ఏప్రిల్ నెలాఖరు నాటికి కనీసం 50 శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనులు వేగంగా, నాణ్యతతో కొనసాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# కరస్పాండెంట్ల పాపం.. విద్యార్థులకు శాపం

### విలీనంతో విద్యార్థులపై ఫీజుల ఒత్తిడి...

### అయోమయంలో విద్యార్థులు...

### ఆందోళనలో తల్లిదండ్రులు.




గోదావరిఖని ఏప్రిల్ 03 (చాటింపు ప్రతినిధి) : ఎస్సీ వర్గానికి చెందిన పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యాభ్యాసం కోసం ఏర్పాటు చేసిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఇప్పుడు అనుకోని సమస్యలను ఎదుర్కొంటున్నాయి. విద్యార్థులకు ఉచితంగా విద్య అందించే ఈ స్కూల్స్‌లోని గోదావరిఖని బ్రిలియంట్ స్కూల్ లో చదివే విద్యార్థులు ఇప్పుడు అనిశ్చితిలో నిలిచారు. తాజాగా బ్రిలియంట్ స్కూల్ యాజమాన్యం నిర్వహణ బాధ్యతలకు చేతులెత్తేసి మార్కండేయ కాలనీలోని మరో పాఠశాలలో తమ విద్యార్థులను విలీనం చేసింది. దాంతో ఫీజు సంబంధ సమస్యలు తలెత్తాయి. బెస్ట్ అవైలబుల్ స్కూల్ కాని పాఠశాలలో విలీనమైన కారణంగా, బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులపై కొత్త పాఠశాల యాజమాన్యం ఫీజు కట్టాలని ఒత్తిడి ప్రారంభించింది. తల్లిదండ్రులు ఆర్థిక పరిమితుల కారణంగా బెస్ట్ అవైలబుల్ స్కూల్ జాబితాలో లేని స్కూల్ లో తమ పిల్లలను పెట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్తు ఏంటి? ఈ ఒత్తిడి వల్ల తమ పిల్లల విద్యపై ప్రభావం ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. రామగుండం ప్రాంతంలో ఫీజులు భారీగా ఉన్న నేపథ్యంతో సమస్య మరింత తీవ్రమైంది. తల్లిదండ్రులు తగిన మార్గం ఏమిటో తెలియక ఆందోళనలో ఉన్నారు. విద్యార్థుల భవిష్యత్తును రక్షించడానికి విద్యాశాఖ అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సామాజిక వర్గాలు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

చాటింపు
CHATIMPU Telugu Daily
జనరల్ న్యూస్ శనివారం 4 ఏప్రిల్ 2026

# కొమురయ్య పోరాట స్ఫూర్తి నేటితరానికి మార్గదర్శకం

**బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి**



పెద్దపల్లి ఏప్రిల్ 03 (చాటింపు ప్రతినిధి) : దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శమని బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సాయుధ పోరాటంలో తొలి త్యాగధనుడిగా నిలిచిన కొమురయ్య నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణత్యాగం చేసిన గొప్ప యోధుడని కొనియాడారు. ఆయన చూపిన ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. మహనీయులను కుల, వర్గాలకు పరిమితం చేయకుండా వారి ఆశయాలను అందరూ ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య భద్రతనిస్తూ మెరుగైన వైద్యాన్ని అందించేది ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసీ



కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 03 (చాటింపు ప్రతినిధి) : అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న ఇద్దరూ లబ్ధిదారులకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన లబ్దిదారులకు అందజేశారు. ఎల్వోసీ పత్రాల అందజేతలో భాగంగా 131 – కుత్బుల్లాపూర్ డివిజన్ లబ్ధిదారుడు తోట నాగేశ్వర రావు తండ్రి టీ. రామదాసు కు 1,50,000/– (లక్ష యాభై వేల రూపాయలు) మంజూరు కాగా మరొక లబ్ధిదారుడు 127 – రంగారెడ్డి నగర్ డివిజన్ కు చెందిన ఎం. నర్సింగ్ రావు తండ్రి ఎం.ఆనంద్ రావుకు 2.00 లక్షలు (రెండు లక్షల రూపాయలు) మంజూరైన ఎల్వోసీ పత్రాలను ఆయా డివిజన్లకు చెందిన నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సుధాకర్, కిషోర్ చారి, నార్లకంటి బాలయ్య, జల్ద లక్ష్మీ నారాయణ, ఎర్వ సాయి కిరణ్ (బంటి), ఎండీ. నసీరుద్దీన్, ఆంజనేయులు, రమణా రెడ్డి, కొత్త నర్సింహా రెడ్డి, కళ్లెం శ్రీనివాస్, రహీం, అల్లావుద్దీన్, డీజే.రమేష్, తిమ్మయ్య, రాంచందర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా కమిటీ సభ్యులు...



కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 3: (చాటింపు ప్రతినిధి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి మెడ్చల్––మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీకి నూతనంగా నియమితులైన సభ్యులు బాచుపల్లి లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మరియు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆమోదంతో, డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో ఎన్నికైన సభ్యులు. జిల్లా ఉపాధ్యక్షులుగా ముత్యం రెడ్డి, బుయ్యని శివ కుమార్; జనరల్ సెక్రటరీలుగా బైరి ప్రశాంత్ గౌడ్, సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, గోపాల్ రెడ్డి; సెక్రటరీలుగా పండరి రావు, గణేష్; కార్యనిర్వాహక సభ్యులుగా లక్ష్మి చౌదరి, కరణ్ లను కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమంత్ రెడ్డి వారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, ప్రజా సమస్యలపై సమిష్టిగా పనిచేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాంచందర్, హరి కిరణ్ పటేల్, చందు, రాజు చారి, తైలం శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, జక్కుల మల్లేష్ యాదవ్, హన్మి రెడ్డి, సత్తి రెడ్డి, నాగేంద్ర, అనిల్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ త్యాగాన్ని కాదు మరణాన్ని కోరుకుంది

## ప్రియుడి మరణాన్ని తట్టుకోలేక ప్రియురాలు ఆత్మహత్య.





చేర్యాల ఏప్రిల్ 03(చాటింపు ప్రతినిధి) : ప్రేమ త్యాగాన్ని కోరుతుంది అంటారు కానీ సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో మరణాన్ని కోరుకుంది. అనుముల రాకేష్ రెడ్డి(25), తరిగొప్పుల హారిక(22) అనే ప్రేమజంట గత కొన్ని సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. వారి ప్రేమ గుర్తుండి పోయేలా ఒకరి పుట్టినరోజును మరొకరు చాలా గ్రాండ్ గా జరుపుకున్నారు. వారి ప్రేమకు చిహ్నంగా ఇరు కుటుంబాలకు తెలవకుండా ప్రేమికులిద్దరూ పెళ్లి చేసుకుని హైదరాబాదులో వేరు కాపురం పెట్టారు. సాఫీగా సాగుతున్న వారి కాపురంలో పెండ్లి విషయం తెలిసిన కుటుంబ పెద్దలు ప్రేమకు రెండు మనసులు కావాలి కానీ పెండ్లికి రెండు కుటుంబాల తో పాటు కులాలు కలవాలని ఎదురు పడ్డారు. ముఖ్యంగా వివాహ విషయం ప్రియుడి తల్లిదండ్రులకు తెలియడంతో అబ్బాయిని వారి ఇంటికి బలవంతంగా తీసుకెళ్లారు. ప్రేమించిన ప్రియుడు ఎక్కడ దూరమవుతాడో అనే బాధలో ప్రియురాలు హారిక ఆత్మహత్య ప్రయత్నం చేసింది. కోలుకున్న అనంతరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ప్రియుడి తల్లిదండ్రులను పిలిచి స్థానిక పోలీసులు మాట్లాడారు. కొద్ది రోజులు సమయం ఇస్తే పెద్దల సమక్షంలో పెళ్లి చేస్తామని మాట ఇవ్వడంతో అందుకు ఇరు కుటుంబాలు అంగీకరించారు. అయితే ఈ ఒప్పందం జరిగిన కొద్ది రోజులలోనే కుటుంబంలో జరిగిన గొడవలతో కొద్దిరోజుల క్రితం రాకేష్ రెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నాలుగు రోజుల క్రితం మృతి చెందాడు. భర్త మరణాన్ని తట్టుకోలేని హరిక గురువారం సాయంత్రం నర్మెట మండలంలోని అమ్మమ్మ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ముస్త్యాల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బ్రతికుండంగ ప్రేమికులను కలవనీయని కుటుంబ పెద్దలు వారి మరణాన్ని జీర్ణించుకోలేక దు:ఖ సాగరంలో మునిగిపోయారు.

# కాప్రా మండలానికి తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరమ్ అధ్యక్షురాలిగా మేడ

**మానవ హక్కుల పరిరక్షణకు అంకిత భావంతో సేవలందిస్తామని స్పష్టం.**



కాప్రా ఏప్రిల్ 03(చాటింపు ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరమ్ సంస్థ కాప్రా మండల అధ్యక్షురాలిగా మేడ మరియను నియమించినట్లు సంస్థ ఛైర్పర్సన్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి చౌదరి అధికారిక ప్రకటనలో వెల్లడించారు. ఈ నియామకం సంస్థలో నూతన ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, మానవ హక్కుల పరిరక్షణ ఉద్యమానికి మరింత బలం చేకూర్చనుంది. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మేడ పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ భావోద్వేగంతో స్పందించారు. "మా మీద విశ్వాసం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన ఛైర్పర్సన్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి చౌదరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అలాగే మా నియామకానికి కృషి చేసిన జట్ల పద్మావతి, తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కావేరి, సూరారం మేడ్చల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను, అని పేర్కొన్నారు. మానవ హక్కుల పరిరక్షణ తమ ప్రాధాన్య లక్ష్యమని స్పష్టం చేస్తూ, "బాధితులకు అండగా నిలిచి, అన్యాయం జరిగిన ప్రతి సందర్భంలో న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం. సమాజంలో బలహీన వర్గాల హక్కులు కాపాడటం మా ధ్యేయం. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా కృషి చేస్తాం," అని ధృడంగా తెలిపారు. అదేవిధంగా సంస్థ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని, "సంస్థను మరింత బలోపేతం చేస్తూ, హక్కులు భంగమవుతున్న ప్రతి సందర్భంలో తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరమ్ తరపున గట్టిగా స్పందిస్తాం. ఈ నియామకం మా బాధ్యతను మరింత పెంచింది అని పేర్కొన్నారు.

ఈ నియామకాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, ట్రస్టు సభ్యులు, సామాజిక కార్యకర్తలు హర్షిస్తూ మేడ మరియకు శుభాకాంక్షలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణలో ఆమె స్ఫూర్తిదాయక నాయకత్వం సమాజానికి మేలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మానవ సేవయే మాధవ సేవగా చలివేంద్రాల ఏర్పాటు జరగాలి

**ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్.**



కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 03 (చాటింపు ప్రతినిధి) : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 125 – గాజుల రామారం డివిజన్ హెచ్ఏఎల్ కాలనీ లో శ్రీ లలితా భక్త మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివెంద్రాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు ద్వారా దాహార్తిని తీర్చడం మాధవ సేవతో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, శ్రీ లలితా భక్త మండలి సభ్యులు ప్రమీలా, లక్ష్మీ సామ్రాజ్యం, విజయలక్ష్మి, కళ్యాణి, అనిత, ధనలక్ష్మి, సంధ్య, సుమతి, అరుణ, భారతి, కాలనీవాసులు ఆంజనేయులు, వీరయ్య చౌదరి, పానకాలు, సుమన్, మహేష్, మధుసూదన్ రావు, మూర్తి, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, సుంకరి చందు, చెట్ల వెంకటేష్, బోయిని మహేష్, చిన్న చౌదరి, రాములు గౌడ్, చంద్ర శేఖర్ గౌడ్, నవీన్ దండుగుల, మల్లేష్, సంగమేష్, ప్రసాద్, శివా నాయక్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన సింగిరెడ్డి వెంకట్ రెడ్డి , గిల్లల తిరుమల్ రెడ్డి షామీర్పేట్ నివాసంలో ఈటల రాజేంద ర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి శాలువా కప్పి సత్కరించిన ఈటల రాజేందర్ .కష్టపడి పని చేసి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని వారికి సూచించారు.

– హైదరాబాద్ ఏప్రిల్ 03(చాటింపు ప్రతినిధి).

# పవనసుత భజన మండలి ఆధ్వర్యంలో చలివేద్రం ఏర్పాటు

**భజన మండలి సభులను అభినందించిన చేర్యాల సీఐ.**




చేర్యాల ఏప్రిల్ 03(చాటింపు ప్రతినిధి) : చేర్యాల పట్టణ కేంద్రంలో పవనసుత భజన మండలి ఆధ్వర్యంలో చేర్యాల సిఐ రమేష్ నాయక్ చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా విజయవంతంగా చలివేంద్రం నిర్వహిస్తూ ప్రజల దాహార్తి తీరుస్తూ ప్రజలకు సేవ చేయడం అభినందనీయం అని, వేసవి ఎండలకు తీవ్రంగా అలసిపోతున్న ప్రజలు, ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులకు చల్లని నీరు అందుబాటులో ఉండేలా చలివేంద్రం ఏర్పాటు చేసిన పవనస్థ భజన మండలి సభ్యులను అభినందిస్తూ ఇలాంటి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు సమాజంలో మంచి ప్రభావం చూపుతాయి అని అన్నారు. ఈ సందర్భంగా పవనసుత భజన మండలి అధ్యక్షులు, సభ్యులు ఈ అవకాశం కల్పించినందుకు సిఐ కి కృతజ్ఞతలు తెలుపుతూ భజన మండలి ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సమాజ సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని, ఈ చలివేంద్రం ద్వారా పట్టణంలోని వేలాది మందికి ప్రయోజనం చేకూరుతుందని, చలివేంద్రంలో శుద్ధమైన చల్లని నేరుతోపాటు కొన్ని ప్రాథమిక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. వేసవి కాలం మొత్తం ఈ చలివేంద్రం 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఈ కార్యక్రమం ద్వార సమాజ సేవా భావనను మరింత బలోపేతం చేస్తుందని అందరూ ఆశాభావం వ్యక్తం చేశారు. పవనసుత భజన మండలి సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంచిర్యాలలో ఫేక్ నోట్ల కలకలం

**దొంగనోట్లు చలామణి చేస్తున్న ముఠా అరెస్ట్**

**మంచిర్యాల,ఏప్రిల్3 :** జిల్లాలో దొంగ నోట్ల వ్యవహారం కలకలం రేపింది. ఫేక్ కరెన్సీని నిర్మూలించాలని ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వాటి చలామణి మాత్రం ఆగడం లేదు. కొత్తకొత్త ప్లాన్లు వేస్తూ పోలీసులనే బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారు కేటుగాళ్లు. తాజాగా దొంగనోట్లు చెలామణి చేస్తూ అడ్డంగా బుక్కయ్యారు ఓ ముఠా సభ్యులు. వారి గుట్టురట్టు చేసి కటకటాల వెనక్కి పంపారు పోలీసులు. నిందితుల నుంచి లక్షల రూపాయల ఫేక్ నోట్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. మంచిర్యాల జిల్లాలో ఫేక్ నోట్లు చెలామణి చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఫిబ్రవరి 25న ఓ పెట్రోల్ బంకులో మూడు రూ.500 నోట్లు ఇచ్చారు ముఠా సభ్యులు. నోట్లపై ఒకే సీరియల్ నంబర్ ఉండడంతో అనుమానం వచ్చి పోలీసులకు బంక్ సిబ్బంది ఫిర్యాదు చేశారు. తీగ పట్టుకుని లాగగా డొంక మొత్తం కదిలింది. ప్రధాన సూత్రధారి కానుగంటి క్రాంతి సహా 13 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,98,500లు స్వాధీనం చేసుకున్నారు. 12 సెల్ ఫోన్లు, మూడు వాహనాలు సీజ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడలో తెలిసిన పరిచయాల ద్వారా ఫేక్ నోట్లను కేటుగాళ్లు చలామణి చేస్తు?న్నట్లు పోలీసులు గుర్తించారు.

# పీరియడ్ బ్లడ్ వ్యర్థ పదార్థం కాదు..
## మహిళలకు వచ్చే వ్యాధులను ముందుగానే గుర్తించవచ్చు..



మహిళల నెలసరి రక్తం (పీరియడ్ బ్లడ్)ను సాధారణంగా శరీర వ్యర్థంగా భావిస్తారు. అయితే తాజా పరిశోధనలు ఈ భావనను పూర్తిగా మార్చుతున్నాయి. పీరియడ్ రక్తంలో అనేక రకాల బయోమార్కర్లు ఉండటంతో అది శరీర ఆరోగ్య పరిస్థితులను అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా డయాబెటిస్, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశాలు ఉన్నాయని అధ్యయనాలు వెల్లడించాయి. అమెరికాలోని ఫైన్‌స్టీన్ ఇనిస్టిట్యూట్స్‌కు చెందిన శాస్త్రవేత్తలు మాట్లాడుతూ గర్భాశయానికి సంబంధించిన అనేక వ్యాధులను పీరియడ్ రక్తం ద్వారా గుర్తించవచ్చని పేర్కొన్నారు.

### బీఎంజే జర్నల్ ప్రకారం..

డయాబెటిస్ నిర్ధారణలో కూడా పీరియడ్ రక్తం కీలక పాత్ర పోషించగలదని పరిశోధనలు సూచిస్తున్నాయి. BMJ Reproductive Health జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో పీరియడ్ రక్తంలో ఉన్న HbA1c స్థాయిలు సాధారణ రక్తంతో పోలిస్తే సమానంగా ఉన్నట్లు తేలింది. 172 మంది మహిళలపై చేసిన ఈ అధ్యయనంలో ఆరోగ్యవంతులు, డయాబెటిస్ ఉన్నవారిలో కూడా ఈ స్థాయిల మధ్య బలమైన సంబంధం కనిపించింది. దీని ద్వారా సూదులు లేకుండానే రక్తంలో చక్కెర స్థాయిలను తెలుసుకునే అవకాశం ఏర్పడుతోంది. క్యాన్సర్ నిర్ధారణలో కూడా పీరియడ్ రక్తం ఉపయోగకరంగా మారుతోంది. ముఖ్యంగా హ్యూమన్ ద్వారా సర్వైకల్ క్యాన్సర్ ప్రమాదాన్ని గుర్తించడం, అలాగే CA-125, CEA వంటి బయోమార్కర్ల ద్వారా ఎండోమెట్రియల్, బ్రెస్ట్, లంగ్ క్యాన్సర్లను ముందుగానే గుర్తించే అవకాశాలు ఉన్నాయి. MenstruAI అనే స్మార్ట్ ప్యాడ్ ద్వారా ఈ మార్పులను రంగు మార్పుల ద్వారా లేదా మొబైల్ యాప్ సహాయంతో గుర్తించవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి.

### గర్భాశయంలోని మార్పులకు సూచిక..

ఇక పీరియడ్ రక్తం ఎందుకు ప్రత్యేకమంటే అది గర్భాశయంలో జరిగే మార్పులను ప్రతిబింబిస్తుంది. ఎండోమెట్రియం పొర విడిపోవడం వల్ల హార్మోన్లు, ఇన్‌ఫ్లమేషన్, రక్తంలో చక్కెర స్థాయిల వంటి అనేక అంశాలపై సమాచారం అందుతుంది. కొన్ని అధ్యయనాలు రెండు నెలలపాటు నమూనాలను పరిశీలించి, డయాబెటిస్, ఇన్‌ఫ్లమేషన్ వంటి ఆరోగ్య సూచికలను కచ్చితంగా గుర్తించగలవని నిర్ధారించాయి. ఉదాహరణకు HbA1c మూడు నెలల సగటు షుగర్ స్థాయిని చూపుతుంది. ఇది మహిళల ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావం చూపనుంది. ముఖ్యంగా డయాబెటిస్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం సులభమవుతుంది. పీరియడ్ రక్తం ద్వారా HbA1c పరీక్షలను ఇంట్లోనే చేయడం సాధ్యమవుతుండటంతో ఆరోగ్య పర్యవేక్షణ మరింత సులభం అవుతుంది. ఇది వ్యాధి నియంత్రణకు ఉపయోగపడుతుంది.

### కఠిన వైద్య పరీక్షల అవసరం ఉండదు..

క్యాన్సర్ స్క్రీనింగ్‌లో కూడా ఇది విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. బయాప్సీల వంటి కఠిన పరీక్షలు అవసరం లేకుండానే పీరియడ్ రక్తం ద్వారా క్యాన్సర్ సూచనలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంది. దీనివల్ల చికిత్సను ప్రారంభ దశలోనే ప్రారంభించవచ్చు.

గర్భాశయం, ప్రధాన ఆరోగ్యంపై కూడా పీరియడ్ రక్తం కీలక సమాచారం అందిస్తుంది. ఎండోమెట్రియోసిస్ వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం సాధ్యమవుతుంది. HMGB1 వంటి మార్కర్లు ఈ వ్యాధి పురోగతిని తెలియజేస్తాయి. పీరియడ్ రక్తం ద్వారా ఆరోగ్యాన్ని స్వయంగా పర్యవేక్షించుకునే అవకాశం మహిళలకు అందుబాటులోకి వస్తోంది. సూదులు లేకుండా, సులభంగా పరీక్షలు చేసుకోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆరోగ్య సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇది వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించనుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

# ఇంట్లో బల్లులు తిరుగుతుంటే ఇరిటేషన్‌గా ఉందా.. అయితే ఈ టిప్స్ మీ కోసమే..!



ఇంట్లో బల్లులు తిరుగుతుంటే కొందరికి ఒల్లు జలదరిస్తుంది. కొందరు అవి వంటల్లో ఎక్కడ పడుతాయోనని భయాందోళనకు గురవుతుంటారు. ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే కొన్ని చిన్నచిన్న టిప్స్ పాటిస్తే సరిపోతుంది. ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడం, బల్లులకు పడని పదార్థాలను ఇంట్లో ఉంచడం ద్వారా సమస్యకు చెక్ పెట్టవచ్చు. మరి బల్లికి పడని ఆ పదార్థాలేమిటో, పాటించాల్సిన టిప్స్ ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..

### 1. చల్లదనం

బల్లులు చల్లదనాన్ని భరించలేవు. ఇవి ఎక్కువగా వేడిగా ఉండే ప్రదేశాల్లో ఉండటానికే ఇష్టపడుతాయి. వేడిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడితే బల్లులు తట్టుకోలేవు. కాబట్టి ఇంట్లో అప్పుడప్పుడు ఏసీని పెంచండి. దాంతో బల్లులు కనిపించకుండా పోతాయి. లేదంటే ఓ స్ప్రే బాటిల్‌లో చల్లటి నీళ్లు తీసుకుని వాటిపై స్ప్రే చేసినా బల్లులు పారిపోతాయి.

### 2. నిమ్మ

నిమ్మ లాంటి సిట్రస్ జాతి మొక్కల వాసన కేవలం బల్లులే కాదు, ఏ పురుగులకు కూడా పడదు. సిట్రస్ పండ్లను, ఆకులను బల్లులు, పురుగులు అసహ్యించుకుంటాయి. కాబట్టి నిమ్మకాయ ముక్కలనుగానీ, నిమ్మ ఆకులనుగానీ బల్లులు తిరిగేచోట పెడితే అవి రాకుండా ఉంటాయి. అంతేగాక నిమ్మగడ్డిని కాల్చి ఆ పొగ ఇల్లు మొత్తం వ్యాపించేలా చేస్తే కూడా బల్లులు దరిచేరవు.

### 3. కర్పూరం

కర్పూరం వాసన కూడా బల్లులకు అస్సలు పడదు. కర్పూరం వాసన వాటికి ఎలర్జీ ఫీల్‌ను ఇస్తుందట. అందుకే కర్పూరానికి దూరంగా ఉంటాయట. కాబట్టి ఇంట్లో అక్కడక్కడ కర్పూరం బిళ్లలు పెడితే బల్లులు దెబ్బకు పారిపోతాయి.

### 4. పరిశుభ్రత

బల్లులు ఊరికెనే ఇంట్లోకి రావు. మీ ఇంట్లో ఆహారం దొరికితేనే అవి ఇంట్లో దూరుతాయి. చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉన్న ఇల్లు బల్లిని ఆహ్వానిస్తుంది. కాబట్టి బల్లులు రావద్దంటే ఇంటిని ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి.

### 5. నెమలి ఈకలు

వినడానికి వింతగా ఉన్నా నెమలి ఈకలంటే బల్లులకు భయమట. కాబట్టి బల్లులు తిరిగే చోట నెమలి ఈకలను వేలాడదీస్తే అవి పత్తాలేకుండా పారిపోతాయట.

### మరికొన్ని చిట్కాలు

పెప్పర్ స్ప్రే మంటను కూడా బల్లులు తట్టుకోలేవట. కాబట్టి పెప్పర్ స్ప్రేను చల్లడం ద్వారా బల్లుల సమస్యకు చెక్ పెట్టవచ్చు.

కాఫీ, తంబాకు మిక్సింగ్ వాసన కూడా బల్లులకు పడదు. కాబట్టి వాటి మిశ్రమం వాసన చూపిస్తే బల్లులు పారిపోతాయట.

ఆపిల్ సైడర్ వెనిగర్ వాసన కూడా బల్లులకు పడదు. కాబట్టి ఆపిల్ సైడర్ వెనిగర్‌ను స్ప్రే చేస్తే బల్లులు పరారవుతాయి.



# మొలకలను మీరు ఎలా తింటున్నారు..? నేరుగా తినకూడదు, ఎందుకంటే..?

మొలకలు (స్ప్రౌట్స్) ఆరోగ్యకరమైన ఆహారంగా చాలా కాలంగా మంచి పేరు సంపాదించుకున్నాయి. సలాడ్లు, చాట్స్, బ్రేక్‌ఫాస్ట్ బౌల్స్‌లో వీటిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ఎక్కువగా ముడిగా తింటేనే ఆరోగ్యానికి మంచిదని చాలా మంది భావిస్తారు. బరువు తగ్గేందుకు, క్లీన్ ఈటింగ్ డైట్‌లో కూడా స్ప్రౌట్స్‌ను విస్తృతంగా సూచిస్తారు. అయితే ఆహారం ఎంత ముఖ్యమో దాన్ని ఎలా తీసుకుంటామన్నది కూడా అంతే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. స్ప్రౌట్స్ పోషకాలను కలిగి ఉన్నప్పటికీ, ప్రతిరోజూ ముడిగా తినడం మంచిది కాకపోవచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముడి మొలకలు తినడంలో ఒక ముఖ్యమైన సమస్య బ్యాక్టీరియా ప్రమాదం. మొలకలు వేడి, తేమ ఉన్న వాతావరణంలో పెరుగుతాయి. ఇదే పరిస్థితులు ఈ.కోలి, సాల్మొనెల్లా వంటి హానికర బ్యాక్టీరియా పెరగడానికి అనుకూలంగా ఉంటాయి.

### ప్రోటీన్‌కు ప్రధాన వనరు కాదు..

మొలకలు తయారీ సమయంలో కలుషితం అయితే ఈ బ్యాక్టీరియా వేగంగా పెరిగే అవకాశం ఉంటుంది. కేవలం నీటితో కడగడం వల్ల ఇవి పూర్తిగా తొలగిపోవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే మొలకలను తేలికగా ఆవిరి పట్టించడం లేదా వేయించడం ద్వారా తినడం సురక్షితమైన మార్గంగా భావిస్తున్నారు. స్ప్రౌట్స్‌ను ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారంగా చాలా మంది భావిస్తారు. అయితే ఇది పూర్తిగా నిజం కాదని కూడా నిపుణులు చెబుతున్నారు. 100 గ్రాముల స్ప్రౌట్స్‌లో కేవలం 3-4 గ్రాముల ప్రోటీన్ మాత్రమే ఉంటుంది. ఇది ఇతర ప్రోటీన్ వనరులతో పోలిస్తే తక్కువ. అందువల్ల స్ప్రౌట్స్‌ను ప్రధాన ప్రోటీన్ వనరుగా కాకుండా, ఉపాహారంగా మాత్రమే తీసుకోవడం మంచిది. సరైన ప్రోటీన్ కోసం పప్పులు, పనీర్, గుడ్లు, టోఫు, శనగలు వంటి ఆహారాలను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### సున్నితమైన జీర్ణ వ్యవస్థ ఉంటే..

అంతేకాకుండా ముడి మొలకలు జీర్ణక్రియపై కూడా ప్రభావం చూపవచ్చు. వీటిలో అధికంగా ఫైబర్, ఫెర్మెంటబుల్ కార్బొహైడ్రేట్లు ఉండటం వల్ల కొందరికి జీర్ణ సమస్యలు రావచ్చు. ముఖ్యంగా సున్నితమైన జీర్ణ వ్యవస్థ ఉన్నవారికి లేదా IBS వంటి సమస్యలు ఉన్నవారికి ఉబ్బరం, గ్యాస్, కడుపు నొప్పి వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కనుక మొలకలను తేలికగా వండి తీసుకోవడం వల్ల సులభంగా జీర్ణమవుతాయి.

### ఎలా తినాలి..?

మొలకలను నిల్వ చేయడం కూడా చాలా ముఖ్యమైన విషయం. ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల బ్యాక్టీరియా పెరుగుదల కొంత వరకు తగ్గుతుంది, కానీ పూర్తిగా ఆగదు. అందుకే మొలకలను ఫ్రిజ్‌లో ఉంచి 24 నుంచి 48 గంటల్లోపే ఉపయోగించడం మంచిది. ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంచితే అవి చెడిపోయే ప్రమాదం ఉంటుంది. స్ప్రౌట్స్ పోషకాలు ఉన్న ఆహారం అయినప్పటికీ, వాటిని ఎలా తింటామన్నది చాలా ముఖ్యం. ముడిగా కాకుండా తేలికగా వండి తినడం, సరైన విధంగా నిల్వ చేయడం ద్వారా వాటి ప్రయోజనాలను సురక్షితంగా పొందవచ్చని పోషకాహార నిపుణులు తెలియజేస్తున్నారు.



# మీరు రోజూ ఈ గింజలు తింటే కొవ్వు ఐస్‌లా కరిగిపోతుందట..!


ఈ మధ్య కాలంలో చాలామంది హై కొలెస్ట్రాల్ సమస్యను ఎదుర్కొంటున్నారు. చాలామంది రక్తంలో కొవ్వు సమస్యతో బాధపడుతున్నారు. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లే ఇందుకు కారణమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అధిక కొలెస్ట్రాల్ కారణంగా గుండె జబ్బుల బారినపడే ప్రమాదం ఉంది. కొలెస్టరాల్ తగ్గడానికి కొన్ని రకాల గింజలు మేలు చేస్తాయి. వాటిలో ఫైబర్‌తోపాటు మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. ఆ గింజలను ఆహారంగా తీసుకోవడంవల్ల కొవ్వు సమస్య నుంచి ఈజీగా బయటపడొచ్చు. మరి ఆ గింజలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.. అవిసె గింజలు గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. వీటినే లీన్ సీడ్స్ అని కూడా అంటారు. ఈ గింజల్లో ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి తోడ్పడుతాయి. కొలెస్ట్రాల్ సమస్యను తగ్గించడంలో చియా విత్తనాలు కూడా దోహదపడతాయి. వీటిలో కూడా ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి దోహదపడతాయి. రక్తంలో కొవ్వు సమస్యతో బాధపడేవారు పొద్దుతిరుగుడు గింజలను తీసుకోవడంవల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిలో విటమిన్ 'ఇ' తోపాటు మోనో శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇవి సాయపడుతాయి. నల్ల నువ్వులను తీసుకోవడం వల్ల కూడా చెడు కొవ్వు తగ్గుతుంది. వీటితో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు క్యాన్సర్ ముప్పు కూడా తగ్గుతుంది. అదేవిధంగా జనపనార విత్తనాలను తీసుకోవడంవల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిలో ప్రోటీన్‌తోపాటు గామా లినోలెనిక్ యాసిడ్ ఉంటుంది. కొలెస్టరాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి చక్కగా పనిచేస్తాయి. గుమ్మడి గింజలు కూడా కొవ్వును తగ్గించడంలో బాగా పనిచేస్తాయి. ఈ గింజలల్లో ఒమెగా-6 ఫ్యాటీ యాసిడ్స్, మోనో శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. నువ్వులకు కూడా కొవ్వును తగ్గించే గుణం ఉంది. వీటిలో యాంటీ ఇన్ ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. కడుపులో మంటను తగ్గించడంలో, కొవ్వును కరిగించడంలో ఇవి సాయపడతాయి.

# దేశానికి అమరావతి గర్వకారణం

## 2029లో మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు చేయిస్తాం: చంద్రబాబు

**అమరావతి :** 'విద్య, విజ్ఞానం, ఉద్యోగం లాంటి అంశాలకు అమరావతి నెర్వ్ సెంటర్‌గా మారుతుంది. దేశానికి ఒక ఫ్యూచర్ సిటీ అవసరం. అది అమరావతే. దేశానికి అమరావతి గర్వకారణంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సైబరాబాద్ ఈ రోజు గొప్ప స్థాయిలో ఉందంటే నాడు విమర్శలకు వెరవకుండా ముందుకు వెళ్లడమే కారణమని, ఇప్పుడు అమరావతి అభివృద్ధి విషయంలోనూ విమర్శలకు భయపడి ఆగిపోయే ప్రసక్తే లేదని అన్నారు. అత్యద్భుత, అత్యాధునిక అమరావతిని నిర్మించి తీరుతామన్నారు. 'సైబరాబాద్ సహా అమరావతిని నిర్మించే అవకాశం భగవంతుడు నాకు కల్పించాడు. రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్నా మంచి రాజధాని నిర్మించాలనే ఆలోచనతో

ముందుకెళ్లాను. అమరావతిని 9 నగరాలుగా నిర్మించాలని ప్రణాళికలు రూపొందించాం. శాశ్వతంగా రాజధాని ప్రాంతాన్ని వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ప్రపంచ శ్రేణి ఆర్కిటెక్ట్‌లతో డిజైన్లు రూపొందించాం. 5, 10, 15 నిమిషాల కాన్సెప్ట్ అత్యాధునిక రాజధాని నిర్మించాలనేది నా ఆలోచన. ఎమర్జెన్సీ సర్వీసులు 5 నిమిషాల్లో చేరుకునేలా.. ప్రజలకు రోజువారీ అవసరాలకు ఉపయోపడే సేవలను 10 నిమిషాల్లో అందించేలా.. కార్యాలయాలు, ఇతర పని ప్రాంతాలకు 15 నిమిషాల్లో చేరుకునేలా అమరావతి రూపకల్పన చేశాం. రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు సింగపూర్ వాళ్లతో ఒప్పందం చేసుకుంటే వారిపై వైసీపీ పాలకులు అభాండాలు వేసి వెళ్లగొట్టారు. అమరావతి బ్రాండ్‌ను దెబ్బతీశారు. నాపై నమ్మకంతో అమరావతి బాండ్లు విడుదల చేస్తే గంటలో రూ.2వేల కోట్లు వచ్చాయి. రాజధాని ప్రాంతానికి ప్రతిష్ఠాత్మక సంస్థలు విట్, ఎస్ఆర్ఎం, అమృత వంటివి వచ్చాయి. ఆ సంస్థలు విట్ అమరావతి, ఎస్ఆర్ఎం అమరావతి అని పెట్టుకుంటే.. ఆ పేరు తీసేయమని వారిపై ఒత్తిడి చేశారు. అమరావతిపై ఎందుకంత ద్వేషం? 2014-19 మధ్య 113 సంస్థలకు 1307 ఎకరాలు కేటాయించాం. ముమ్మరంగా పనులు జరుగుతున్న సమయంలో వైసీపీ అధికారంలోకి వచ్చి వాటిని ఆపేసింది. మూడు రాజధానుల ప్రకటన చేసి వివాదాలు సృష్టించే ప్రయత్నం చేశారు. అమరావతి రైతుల ఉద్యమానికి కౌంటర్‌గా పెయిడ్ ఆర్టిస్టులతో క్యాంపులు పెట్టించారు. ఎస్సీలపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించారు. నాపై రాళ్లు వేయించారు. అదేమని ప్రశ్నిస్తే.. అప్పటి డీజీపీతో భావప్రకటన స్వేచ్ఛ అని మాట్లాడించారు. 3రాజధానులు చట్టవిరుద్ధమని హైకోర్టు న్యాయమూర్తి తీర్పు ఇస్తే ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఆయన బదిలీపై వెళుతుంటే మోకాళ్లపై కూర్చుని దారంతా పూలు చల్లి వీడ్కోలు పలికారు. రాజధానిపై కుట్రలు చేసిన వ్యక్తిని, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వ్యక్తిని నియంత అనాలా లేక ఏమనాలో తెలియడం లేదు. కుట్రలు, కుతంత్రాలను ప్రజలు తిప్పికొట్టారు. మళ్లీ మాకు పట్టం కట్టారు' అని అన్నారు.



### ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

'భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన తొలి రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయింది. అందుకే అమరావతికి పార్లమెంటు సాక్షిగా చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించి విజయం సాధించాం. రాష్ట్రపతి ఆమోదం తర్వాత బిల్లుకు పూర్తిస్థాయి చట్టబద్ధత వస్తుంది. అమరావతి బిల్లుకు అన్ని విధాలా సహకరించిన ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు 5 కోట్ల ఆంధ్రుల తరఫున ధన్యవాదాలు. లోక్‌సభ స్పీకర్‌కు, రాజ్యసభ ఛైర్మన్‌కు కృతజ్ఞతలు. అమరావతిని భవిష్యత్తులోనూ ఎవరూ ఏమీ చేయలేరు' అని పేర్కొన్నారు.

### విభజన తర్వాత అన్నీ ఇబ్బందులే

'విభజన సమయంలో రెండు రాష్ట్రాల్లోనూ భావోద్వేగాలు ఉన్నాయి. చాలా అంశాలు పరిష్కారం కాకున్నా విభజన జరిగింది. మన రాష్ట్రాన్ని ఆర్థిక కష్టాలు వెంటాడాయి. రాజధాని లేదు, వనరులు లేవు. అన్నీ ఇబ్బందులే. తెలంగాణకు నేను ఎప్పుడూ వ్యతిరేకం కాదు. టీడీపీ పుట్టిందే హైదరాబాద్‌లో. ఈరోజు హైదరాబాద్‌లో ఇంతటి సంపద వస్తుందంటే సైబరాబాద్ వంటి నగర నిర్మాణం వల్లే. విభజన తర్వాత విజయవాడకు వస్తే ఎక్కడి నుంచి పాలన చేయాలో తెలియని పరిస్థితి. బస్సులో బస చేసి, నీటిపారుదల ఎస్ఈ కార్యాలయాన్ని సీఎం కార్యాలయంగా చేసుకుని పాలన మొదలుపెట్టాం. రాజధానిని ఎంపిక చేసేందుకు శివరామకృష్ణన్ కమిటీని కేంద్రం ఏర్పాటు చేస్తే 46 శాతం మంది ప్రజలు విజయవాడ-గుంటూరు మధ్య రాజధాని ఏర్పాటుకు అనుకూలమని పేర్కొన్నారు. అప్పుడు కూడా వైసీపీ చాలా డ్రామాలు ఆడింది. ప్రజలను రెచ్చగొట్టి ప్రాంతీయ విభేదాలు సృష్టించాలని చూసింది. మూడు ప్రాంతాలకు సమాన దూరంలో ఉన్న అమరావతిని రాజధానిగా ఎంపిక చేశాం. ఒక్క పిలుపు ఇవ్వగానే 29 వేలమంది రైతులు 34 వేల ఎకరాలను ఇచ్చారు. ప్రభుత్వ భూమి కూడా కలిపితే 54 వేల ఎకరాలు అందుబాటులోకి వచ్చింది. అభివృద్ధిలో రైతులనూ భాగస్వాములను చేసేలా ల్యాండ్ పూలింగ్ స్కీంను తీసుకువచ్చాం. ఇది ప్రపంచం మొత్తానికి ఓ రోల్ మోడల్‌గా నిలిచింది. రాజధానితో తమ జీవితాలు బాగుపడుతాయని రైతులు భూములిచ్చారు. భూములు తీసుకున్న తర్వాత 11నెలల్లో సచివాలయం, అసెంబ్లీ భవనాలు నిర్మించాం. వీటిని వైసీపీ వారు వక్రీకరించి దుష్ప్రచారం చేశారు. ట్రాన్సిట్ క్యాపిటల్‌గా మేము చెబితే టెంపరరీ క్యాపిటల్‌గా ప్రచారం చేశారు. 2016 జూన్ నుంచే ప్రభుత్వ కార్యకలాపాలన్నీ అమరావతి నుంచే నిర్వహించాం. అమరావతిని వ్యతిరేకించిన గత పాలకులూ గతి లేని పరిస్థితిలో ఇక్కడి నుంచే పాలన సాగించారు' అని విభజన అనంతర పరిస్థితిని వివరించారు.

### విపరీత మనస్తత్వంతో తడవకో మాట

'స్వతంత్ర భారతదేశంలో 3 రాజధానుల డ్రామా ఆడిన వ్యక్తులు ఎవరూ లేరు. ఇంత జరిగినా వైసీపీ విషం చిమ్ముతూనే ఉంది. వైసీపీ నేతలు అహంకారం ప్రదర్శిస్తున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందడాన్ని ఓర్వలేకపోతున్నారు. ఈ తిక్కకు పరిష్కారం ఏమిటో నాకు అర్థం కావడం లేదు. తాను ఎక్కడ కూర్చుంటే అదే రాజధాని అని ఓసారి.. రాష్ట్ర రాజధానిని నిర్ణయించే అధికారం పార్లమెంటుకు లేదని మరోసారి మాట్లాడుతున్నారు. తాను అధికారంలోకి వస్తే ప్లాన్ ఏ, ప్లాన్ బీ అమలు చేస్తామని చెబుతున్నారు. అమరావతికి దేశమంతా మద్దతు ఇచ్చింది. వారిని తప్పుపట్టేలా వైసీపీ వింత ప్రవర్తన ఉంది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అవహేళనచేసి మాట్లాడుతారా? అమరావతి అని పలకడం కూడా ఇష్టం లేని వ్యక్తుల గురించి మాట్లాడుకోవాల్సి రావడం దౌర్భాగ్యం. వెంకటేశ్వరస్వామికి ఘోర అపచారం చేసి సమర్థించుకున్న వాళ్ల ప్రవర్తనను ఇంతకన్నా ఇంకేం ఊహిస్తాం. బెదిరింపులతో పెట్టుబడిదారులను తరిమేయాలని చూస్తున్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరించే వారిపై చట్టపరంగా కఠినంగా ముందుకెళ్తాం. వైసీపీ వారి విధానాల వల్ల ఏపీ అప్పుల్లో కూరుకుపోయింది. దక్షిణ భారత రాష్ట్రాల్లో అతి తక్కువ తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా నిలబడింది. విభజన కంటే ఏపీకి వైసీపీ హయాంలోనే ఎక్కువ నష్టం జరిగింది. 30ఏళ్లు వెనక్కి వెళ్లాం. ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టి మరీ అప్పులు తేవడం ఏమిటి? మేం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు వేసుకుని పాలన సాగిస్తున్నాం. ఎక్కువ వడ్డీలకు తెచ్చిన అప్పులను రీషెడ్యూల్ చేసుకుని భారం తగ్గించుకుంటున్నాం. ఒక వ్యక్తి తన పిచ్చి చేష్టలతో రాష్ట్రాన్ని నాశనం చేశారు' అని అన్నారు.

### అమరావతి సంకల్పం ఆగదు

'ఎవరు ఏం చేసినా అమరావతి సంకల్పం ఆగదు. ప్రస్తుతం రూ.56 వేల కోట్ల విలువైన పనులు రాజధానిలో జరుగుతున్నాయి. రాజధాని నిర్మాణం ఏడాదికో, రెండేళ్లకో పూర్తయ్యేది కాదు. అది నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. ప్రధానమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే దానంతట అదే అభివృద్ధి చెందుతూ పోతుంది. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం. దానికి చోదకశక్తిగా అమరావతి నిలుస్తుంది. అమరావతి సెల్ఫ్ సస్టెయినబుల్, మోనిటైజేషన్ ప్రాజెక్టు. ప్రజారాజధాని. ప్రజలు నిరంతరం ఆనందంగా ఉండేలా చూడాలని నేను నిత్యం భగవంతుడిని వేడుకుంటూ ఉంటాను' అని చంద్రబాబు పేర్కొన్నారు.

### అడుగడుగునా అడ్డు

'హైదరాబాద్‌ను నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దేందుకు వేసిన పునాదుల వల్ల అది మోస్ట్ లివబుల్ సిటీగా మారింది. అమరావతిని కూడా అంతకుమించిన స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించి పనులు ప్రారంభించాం. రాజధాని నిర్మాణంలో అందరినీ భాగస్వాములను చేయాలన్న ఉద్దేశంతో దేశంలో, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి మట్టిని, పవిత్రమైన జలాలను తెప్పించాం. ప్రధాని కూడా పార్లమెంటు నుంచి మట్టిని, యమున జలాలను తీసుకువచ్చారు. దేశం మొత్తం అమరావతికి అండగా ఉంటుందనే ఆ మట్టిని, నీటిని తెచ్చినట్లు ప్రధాని చెప్పారు. తాజాగా పార్లమెంటులో జరిగిన అమరావతి బిల్లుపై దేశం మొత్తం అమరావతికి అండగా నిలిచింది. వైసీపీ వాళ్లు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలు చేస్తూనే ఉన్నారు. అమరావతి రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. అమరావతికి వ్యతిరేకంగా ప్రపంచ బ్యాంకుకు ఫిర్యాదులు చేశారు. రైతులకు చెందిన అరటి తోటలు తగులబెట్టారు. పర్యావరణం దెబ్బతింటుందన్నారు. నిర్మాణాలకు అనుకూలం కాదన్నారు. ఎడారి అన్నారు. స్మశానం అన్నారు. భూకంపాలు వస్తాయని ప్రచారం చేశారు. ఎన్ని విధాలుగా రాజధానికి నష్టం కలిగించాలో అన్నీ చేశారు. ఇప్పుడు కూడా చేస్తూనే ఉన్నారు' అని చంద్రబాబు విమర్శించారు.

# ఇరిగేషన్ అధికారులు తీరు మార్చుకోవాలి

### మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి :** గతంలో ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగా కాకుండా, ఇరిగేషన్ అధికారులు తీరు మార్చు కోవాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు . శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రి నిమ్మల నియోజకవర్గాల వారీగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత, వంటి పనులకు సంబందించిన అంచనాల తయారీపై సమీక్ష నిర్వహించారు. ఆయా పనులకు సంబందించి మార్చి 25వ తేదీలోపు నియోజకవర్గాల వారీగా అంచనాలు రూపొందించి పంపించాలని ఆదేశించినా, ఇప్పటివరకు కొంత మంది చీఫ్ ఇంజనీర్లు సరిగా అంచనాలు సమర్పించకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, మట్టి పూడిక తీత వంటి పనులు చేయడానికి ఏప్రియల్, మే, నెలలో మాత్రమే అవకాశం ఉంటుంది. ఆతరువాత ఖరీఫ్ సీజన్ మొదలైతే పనులు చేయడానికి అవకాశం ఉండదని, గతంలో ఏప్రియల్, మే నెలలో చేయాల్సిన పనులకు జూన్ లో అనుమతులు ఇచ్చేవారని, పనులు మొదలుపెట్టిన వెంటనే కాలువలకు నీళ్ళు వదిలేవారని, దీంతో పనులు సగంలోనే వదిలేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఇలా చేయడం వల్ల

ఆయకట్టు చివరన ఉన్న పొలాలకు సాగు నీరందక రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని, ఇలా గతంలో వ్యవహరించిన తీరులో కాకుండా ముందుగానే అంచనాలు రూపొందించి, ఆర్దిక శాఖ అనుమతులు పొందితే సీజన్ మొదలయ్యేలోగా పనులు కూడా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కావున నియోజకవర్గాల వారీగా పనులకు సంబందించిన అంచనాలను ఆదివారం సాయంత్రం లోగా పంపాలని సిఈలను ఆదేశించారు. గడువులోగా అంచనాలను పంపని అధికారులు సోమవారం అమరావతి సచివాలయంకు వచ్చి అంచనాలు ఎందుకు పంపలేకపోయారో సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుందని తీవ్రంగా మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అత్యవసర పనుల కింద నిధులు విడుదల చేసి, కాలవల్లో పూడిక తీత, తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులను చేయడం ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరందించగలిగామని తెలిపారు. గత 5ఏళ్ళ వైసిపి ప్రభుత్వ పాలనలో కనీస నిర్వహణ పనులు సైతం పట్టించుకోకపోవడంతో ఆయకట్టు చివరి ఎకరం వరకు నీరందక రైతులు ఇబ్బంది పడ్డారని, నేడు కూటమి ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగు నీరందించడమే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కావున అధికారులు నిర్లక్ష్యం వదిలి గడువులోగా ఇరిగేషన్ పనులకు సంబందించిన అంచనాలు సమర్పించి, సీజన్ మొదలయ్యేలోగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# నేటి నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లు

### రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాలు

### వెల్లడించిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల

**కాకినాడ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది.. నేటి నుంచి రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలియజేశారు.. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు పక్రియను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.ఇక, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు. రైతులు తమ పంటకు సరైన ధర పొందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ధాన్యం నిల్వ మరియు రవాణా విషయంలో కూడా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసింది. మొత్తం 5.40 కోట్ల గోతాలను సిద్ధం చేసినట్లు, గోతాల కొరత రాకుండా మిల్లర్లతో ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలిపారు. అలాగే ధాన్యం రవాణా కోసం 17,200 లారీలను జీపీఎస్ సదుపాయంతో సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మొత్తంగా, ఈసారి రబీ ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా జరిగేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు ..

# అమరావతిపై వైసీపీకి స్పష్టత లేదు

### మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి

**అమరావతి :** రాజధాని అమరావతిపై వైసీపీకి స్పష్టత కానీ.. స్థిరమైన విధానం కానీ లేదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శించారు. గురువారం రాజ్యసభలో రాజధాని అమరావతి బిల్లు ఆమోదం పొందే సమయంలో వైసీపీ ఎంపీలు వ్యవహరించిన తీరుపై విజయసాయిరెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆ సమయంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై కాంగ్రెస్ ఎంపీ నోరు పారేసుకుంటే.. వైసీపీ ఎంపీలు మౌనం వహించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌పై కాంగ్రెస్ ఎంపీ ఆ విధంగా మాట్లాడితే.. మీకు చీమకుట్టినట్లు అయినా అనిపించ లేదా అంటూ వైసీపీ ఎంపీలను ఆయన సూటిగా ప్రశ్నించారు. రాజ్యసభలో వైసీపీ ఎంపీలు మౌన ప్రేక్షకులయ్యారా? అని విజయసాయిరెడ్డి సందేహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎంపీ వ్యాఖ్యలను కనీసం ఖండించరా? అని వైసీపీ ఎంపీలకు విజయసాయిరెడ్డి చురకలంటించారు. ÷ూజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందింది. ఈ బిల్లుపై బుధవారం లోక్‌సభలో.. గురువారం రాజ్యసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా వైసీపీ హయాంలో అమరావతి విషయంలో వైఎస్ జగన్ వ్యవహరించిన తీరుపై పలువురు ఎంపీలు విమర్శించారు. ఈ వ్యాఖ్యలను రాజ్యసభలోని వైసీపీ సభ్యులు ఎందుకు ఖండించ లేదంటూ విజయసాయిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. పై విధంగా స్పందించారు.

# మచిలీపట్నం ఘటనలో పోలీసులు తీరు దారుణం

### అక్రమ కూల్చివేతలు అడ్డుకుంటే కేసులా

### మాజీ మంత్రి పేర్ని నాని ఘాటు విమర్శలు

**మచిలీపట్నం :** మచిలీపట్నం కొబ్బరితోటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత ఘటనలో పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే కారణంగా రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని నానిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. అయితే.. దీనిపై పేర్ని నాని స్పందించారు. గురువారం జరిగిన ఈ ఘటనపై జిల్లా పోలీస్ అధికార సంఘం అధినేత జయపాల్.. ప్రెస్‌మీట్లో మాట్లాడిన విధానాన్ని తప్పుబట్టారు. నిన్న జరిగిన సంఘటనకు సంబంధించిన వీడియోను చూసి జయపాల్ మాట్లాడిఉంటే బాగుండేది. అక్కడ జరిగిన సంఘటన ఏమిటి? ఆయన ప్రెస్ మీట్లో మాట్లాడిందేమిటి.? వైసీపీ తరఫున శాసనసభ ఎన్నికల్లో పోటీచేసిన వ్యక్తి పేర్ని కిట్టు. ఆయనతో పాటు కార్పొరేటర్లు వచ్చి అండగా నిలబడ్డారు. గత ప్రభుత్వంలో ఏ పేదవాని ఇంటినీ మేం కూల్చలేదు. కానీ మున్సిపల్ అధికారులు ఇప్పుడు కొబ్బరితోటలను కూల్చడం ప్రారంభించారు. గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలని తెలిపారు.. బాగుంది. కానీ అక్కడ ఏం జరిగిందో జయపాల్ తెలుసుకోకుండా.. బాడీ షేమింగ్ చేశారని ఎలా మాట్లాడారు? అసలు ఆ సీఐని మేమెక్కడా ఉదహరించలేదు. ఆయన పేరుతో ఏమీ అనలేదు. అయినా ఏకవచనంతో మీరు మాట్లాడవచ్చా?' అని పేర్ని నాని ప్రశ్నించారు. నా మీద, నా కొడుకు మీద అక్రమ కేసులు కట్టారు. కేవలం పబ్లిసిటీ కోసం ఎవరు ఎదిగారు? ఎవరు ఆరాటపడుతున్నారు? జయపాల్.. నాకు రాజకీయ పబ్లిసిటీ దేనికి? నేను ప్రజలకోసం పోరాటంచేసే వ్యక్తిని? కొందరు పోలీసులు భయంలేకుండా తప్పులు చేస్తున్నారు. మీలా అందరూ మంచి వ్యక్తులు లేరు. పోలీస్ వ్యవస్థ మారింది. పోలీసులు మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకుని పనిచేస్తే అప్పుడు ప్రజలకు పోలీసులతో అవసరమేమీ ఉండదుగా.!' అని వ్యాఖ్యానించారు మాజీ మంత్రి. రెడ్‌బుక్ రాజ్యాంగం రాగానే పామర్రులో ఓ అధికారికి ఎందుకు పోస్టింగ్ ఇచ్చారని ప్రశ్నించిన ఆయన.. ఆ తర్వాత మళ్లీ నాలుగు జిల్లాల అవతలికి ఎందుకు పంపారన్నారు. పోలీస్ వ్యవస్థలో తప్పుచేసిన కొందరు అధికారులను ప్రశ్నించడం తప్పా అని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు పేర్ని నాని. మంత్రి కొల్లు రవీంద్ర ఎన్నోసార్లు పోలీస్ అధికారులను తిట్టారుగా.? అప్పుడీ పోలీస్ జిల్లాధ్యక్షుడికి(జయపాల్‌ను ఉద్దేశించి) కనపించలేదా.? మరప్పుడెందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. 'పోలీసులు సుదీర్ఘ కాలం పనిచేస్తారు. కానీ ఎక్కడా ఎక్కువ కాలం ఉండరు. పవిత్రమైన యూనిఫామ్ వెనుక తప్పుచేసే అధికారిని మాత్రమే మేం ప్రశ్నించాం. అంతేతప్ప నేనెప్పుడూ ఏ పోలీస్ అధికారినీ ఉద్దేశపూర్వకంగా అనలేదు. తప్పుచేసే వ్యక్తులను నిలదీయడం మీ దృష్టిలో తప్పా?' అని చెప్పుకొచ్చారు.

చాటింపు
CHATIMPU Telugu Daily

# పంజాబ్ కింగ్స్ ఘన విజయం



## అభిషేక్ శర్మ జరిమానా కట్టాల్సిందే!

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా నిన్న ఏప్రిల్ 2న ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ మధ్య ఆసక్తికర పోరు జరిగింది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ 65 రన్స్ భారీగా తేడాతో ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ తొలి బోణీ కొట్టింది. అయితే తొలి గెలుపు ఆనందంలో ఉన్న ఎస్ఆర్‌హెచ్ ఓపెనర్ అభిషేక్ శర్మకు మాత్రం ఎదురుదెబ్బ తగిలింది. అభిషేక్ శర్మ మ్యాచ్ ఫీజులో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గట్టి షాక్ ఇచ్చింది. ఐపీఎల్ నిబంధనలను ఉల్లఘించిన కారణంగా మ్యాచ్ ఫీజులో కోత విధిస్తున్న ఐపీఎల్ నిర్వాహకులు తెలిపారు. ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు ఐపీఎల్ నిర్వాహకులు తేల్చారు. అందుకు అనుగుణంగా అభిషేక్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించేందుకు బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు అభిషేక్ శర్మకి కూడా తన ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్ బీసీసీఐ చేర్చింది. ఐపీఎల్ రూల్స్‌లోని ఆర్టికల్ 2.3 కింద లెవెల్ 1 నేరానికి పాల్పడినట్లు అభిషేక్ శర్మ అంగీకరించినట్లు తేలింది. మ్యాచ్ రిఫరీ విధించిన జరిమానాకు అభిషేక్ శర్మ స్వీకరించడంతో ఇందులో తదుపరి విచారణ లేకుండా పోయింది. అయితే అభిషేక్ శర్మ ఏ కారణంగా జరిమానా విధించారో అనే విషయాన్ని ఐపీఎల్ తన అధికారిక ప్రకటనలో స్పష్టంగా చెప్పలేదు. అయితే ఆర్టికల్ 2.3 అనేది సాధారణంగా మ్యాచ్ జరగుతున్న సమయంలో అనుచిత భాషను మాట్లాడినా.. లేదా అసభ్య పదజాలంతో దూషించే వంటి అంశాలు ఈ రూల్ కిందకి వస్తాయి. అయితే అభిషేక్ శర్మ వికెట్ పడిన క్రమంలో అది నాటౌట్‌ను అంపైర్ ఔట్‌గా ప్రకటించడంపై తీవ్ర నిరాశకు లోనయ్యాడు. దీంతో ఆ ఉద్వేగభరిత క్షణంలో అభిషేక్ శర్మ నోరు జారినట్లు చెబుతున్నారు. అయితే ఆ సంఘటన ఈ జరిమానాకు కారణం అయ్యిండొచ్చని చెబుతున్నారు. ఓ వైపు జరిమానా విధించినా.. మరోవైపు అభిషేక్ శర్మ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుతంగా రాణించాడు. కేవలం 21 బంతుల్లో 48 పరుగులు (4 సిక్సర్లు, 4 ఫోర్లు) రాబట్టి.. సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే ఇదే తరుణంలో అభిషేక్ ఓ అరుదైన మైలురాయిని చేరాడు. సన్‌రైజర్స్ టీమ్ తరపున 100 సిక్సర్లు బాదిన రికార్డు గతంలో డేవిడ్ వార్నర్ ఖాతాలో ఉండగా.. ఇప్పుడు దాన్ని అభిషేక్ శర్మ (మొత్తం 101 సిక్సర్లు) చేరుకున్నాడు. ఎంతో ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్దేశించిన 227 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించలేక కేకేఆర్ 16 ఓవర్లలోనే 161 పరుగులకే ఆలౌట్ అయ్యింది.

## రాణించిన అయ్యర్, ప్రభ్‌సిమ్రన్

## మాత్రె మెరుపులు వృథా

చెన్నై : ఐపీఎల్‌లో నిరుటి రన్నరప్ పంజాబ్ కింగ్స్ వంస విజయాల జోరు కొనసాగుతున్నది. శుక్రవారం చిదంబరం స్టేడియంలో జరిగిన పోరులో పంజాబ్ 5 వికెట్ల తేడాతో చెన్నై సూపర్‌కింగ్స్‌పై ఘన విజయం సాధించింది. చెన్నైని వారి సొంత ఇలాఖాలో మట్టికరిపించిన పంజాబ్ వరుసగా రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. చెన్నై నిర్దేశించిన 210 పరుగుల లక్ష్యాన్ని పంజాబ్ 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (29 బంతుల్లో 50, 4ఫోర్లు, 3సిక్సలు) అర్ధసెంచరీకి తోడు ప్రభ్‌సిమ్రన్‌సింగ్(43), ప్రియాంశ్ ఆర్య (39), కనోలి (36) రాణించడంతో పంజాబ్ గెలుపు సులువైంది. హెన్రీ, కంబోజ్ రెండేసి వికెట్లు తీశారు. తొలుత కింగ్స్ ఆహ్వానం మేరకు ఫస్ట్ బ్యాటింగ్ చేసిన చెన్నై.. ఆయుష్ మాత్రె (43 బంతుల్లో 73, 6 ఫోర్లు, 5 సిక్సలు) వీరవిహారానికి తోడు శివమ్ దూబె (27 బంతుల్లో 45 నాటౌట్, 5 ఫోర్లు, 1 సిక్స్), సర్ఫరాజ్ ఖాన్ (12 బంతుల్లో 32, 6 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడటంతో 20 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసింది. విజయ్‌కుమార్(2/38) రాణించాడు.

### ఆయుష్ అదుర్స్

చెన్నై ఇన్నింగ్స్‌లో ఆయుష్ ఆటే హైలైట్. సీఎస్‌కే గంపెడాశలు పెట్టుకున్న సంజూ శాంసన్ (7) చెపాక్‌లోనూ నిరాశపరిచినా కెప్టెన్ రుతురాజ్ (28) అండతో మెరీనా తీరాన మాత్రె రెచ్చిపోయాడు. క్రీజులోకి వస్తూనే బార్ట్‌లెట్ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో తన ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పిన ఈ యువ సంచలనం.. యాన్సెన్ ఓవర్లో స్కేర్ లెగ్, మిడాన్ మీదుగా రెండు భారీ సిక్సలు కొట్టాడు. ఆ తర్వాత అతడి బాదుడుకు బలైంది స్టోయినిస్. అతడి బౌలింగ్‌లోనూ రెండు భారీ సిక్సలతో 17 రన్స్ రాబట్టడమే గాక 29 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. ఓవర్‌కు పది పరుగులకు తగ్గకుండా సాగుతున్న చెన్నై జోరుకు చాహల్ బ్రేకులు వేశాడు. అతడి 12వ ఓవర్లో బంతిని స్వీప్ చేయబోయిన రుతురాజ్.. బౌండరీలైన్ వద్ద వధేరా చేతికి చిక్కడంతో 55 బంతుల్లో 96 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. వైశాక్ వేసిన మరుసటి ఓవర్లో థర్డ్ మ్యాన్ వద్ద చాహల్‌కు క్యాచ్ ఇవ్వడంతో మాత్రె ఇన్నింగ్స్ ముగిసింది. కార్తీక్ (1) విఫలమైనా ఆరో స్థానంలో వచ్చిన సర్ఫరాజ్.. ఉన్నది కొద్దిసేపే అయినా టెక్నిక్‌తో కూడిన ఆటతో ఆకట్టుకున్నాడు. అర్ష్‌దీప్, వైశాక్





ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. సర్ఫరాజ్ నిష్క్రమించినా అప్పటికే క్రీజులో కుదురుకున్న దూబె.. భారీ షాట్లతో చెన్నైకి ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.

### పంజాబ్ ఆడుతూ పాడుతూ..

ఛేదనను పంజాబ్ దూకుడుగానే ఆరంభించింది. ఓపెనర్లు ప్రియాన్ష్, ప్రభ్‌సిమ్రన్ వేగంగా ఆడటంతో పవర్ ప్లేలో ఆ జట్టు 68/1తో పటిష్ట స్థితిలో నిలిచింది. హెన్రీ రెండో ఓవర్లో ప్రియాన్ష్ 4, 6, 4 బాదగా.. కంబోజ్ ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ మూడు బౌండరీలతో అలరించాడు. ధాటిగా ఆడే క్రమంలో ఆర్యను హెన్రీ బౌల్డ్ చేసినా.. గత మ్యాచ్ హీరో కూపర్ కనోలితో కలిసి ప్రభ్‌సిమ్రన్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు 33 పరుగులు జోడించింది. అయితే నూర్ అహ్మద్ 9వ ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ రనౌట్ అవగా 12వ ఓవర్లో కనోలిని కంబోజ్ ఔట్ చేయడంతో కింగ్స్ మూడో వికెట్ కోల్పోయింది. 6 ఓవర్లలో ఆ జట్టు విజయానికి 62 రన్స్ అవసరమవగా క్రీజులో ఉన్న కెప్టెన్ శ్రేయస్, వధేరా చెన్నై బౌలర్లను చెడుగుడు ఆడుకున్నారు. ముఖ్యంగా మంచి ఫామ్‌మీదున్న అయ్యర్.. బౌండరీలతో దుమ్మురేపాడు. తన ఇన్నింగ్స్‌లో 4ఫోర్లు, 3సిక్సలతో విరుచుకుపడ్డాడు. వెంటవెంటనే అయ్యర్, నేహాల్ వధేరా(10) ఔటైనా..శశాంక్‌సింగ్ (14 నాటౌట్), స్టొయినిస్(9 నాటౌట్) పంజాబ్‌కు అలవోక విజయాన్నందించారు.

### సంక్షిప్త స్కోర్లు

చెన్నై: 20 ఓవర్లకు 209/5 (మాత్రె 73, దూబె 45లి, వైశాక్ 2/38, చాహల్ 1/21);

పంజాబ్: 18.4 ఓవర్లలో 210/5(అయ్యర్ 50, ప్రభ్‌సిమ్రన్ 43, కంబోజ్ 2/43, హెన్రీ 2/54)

## నా బౌలింగ్‌లో మార్పుల వెనుక ఓ 'మిస్టరీ మ్యాన్'


### నితీష్ కుమార్ రెడ్డి ఇంట్రెస్టింగ్ కామెంట్స్



కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన పోరులో నితీష్ కుమార్ రెడ్డి అద్భుతమైన ప్రతిభను కనబరిచాడు. తొలుత బ్యాటింగ్‌లో 39 పరుగులు చేసిన నితీష్, ఆ తర్వాత బౌలింగ్‌లోనూ రెండు కీలక వికెట్లు తీసి సన్‌రైజర్స్ గెలుపులో కీలక పాత్ర పోషించాడు. గత సీజన్‌లో గాయాల కారణంగా ఇబ్బంది పడిన ఈ యువ ఆటగాడు, ఈ ఏడాది తన బౌలింగ్ శైలిని పూర్తిగా మార్చుకుని ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. తన బౌలింగ్ మెరుగుపడటం వెనుక ఒక ప్రత్యేక వ్యక్తి ఉన్నారని నితీష్ వెల్లడించడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. విజయం అనంతరం నితీష్ మాట్లాడుతూ.. తన బౌలింగ్ మెరుగుదలపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. "నేను నా బౌలింగ్ విషయంలో నిరంతరం శ్రమిస్తుంటాను. గత ఏడాది గాయాల వల్ల సాధన చేయడానికి తగిన సమయం దొరకలేదు. కానీ ఈ సీజన్ ప్రారంభానికి ముందు ఒక వారం పాటు ఒక ప్రత్యేక వ్యక్తి పర్యవేక్షణలో శిక్షణ తీసుకున్నాను. ఆయన ఇచ్చిన సూచనలు ఇప్పుడు మైదానంలో అమలు చేస్తున్నాను. అయితే ఆ వ్యక్తి ఎవరనేది ఇప్పుడే బయట పెట్టను, త్వరలోనే వెల్లడిస్తాను" అని నితీష్ సస్పెన్స్ మెయింటైన్ చేశాడు. ఈడెన్ గార్డెన్స్ పిచ్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింటికీ అనుకూలంగా ఉంటుందని నితీష్ పేర్కొన్నాడు. బ్యాటింగ్ చేస్తున్న సమయంలోనే పిచ్ నెమ్మదిగా ఉందని గమనించినట్లు చెప్పాడు. "కోల్‌కతా బౌలర్లు స్లో బౌన్సర్లు వేయడం చూశాక, మేము బౌలింగ్ చేసేటప్పుడు కూడా అదే వ్యూహాన్ని అనుసరించాలని నిర్ణయించుకున్నాను. రింకూ సింగ్ వంటి ప్రమాదకరమైన బ్యాటర్ వికెట్‌ను స్లో బంతి ద్వారానే పడగొట్టాను. పిచ్ పరిస్థితులను గౌరవించి బౌలింగ్ చేయడం వల్లే ఫలితం దక్కింది" అని వివరించాడు. హెన్రిచ్ క్లాసెన్‌తో కలిసి ఆడటం గొప్ప అనుభూతిని ఇచ్చిందని నితీష్ తెలిపాడు. సీనియర్ ఆటగాళ్లు ఇచ్చే సూచనలు యువ ఆటగాళ్లకు ఎంతో ఉపయోగపడతాయని అన్నాడు. అలాగే తమ బౌలింగ్ విభాగంపై వస్తున్న విమర్శలను ఆయన కొట్టిపారేశాడు. జయదేవ్ ఉనద్కత్ వంటి సీనియర్లతో పాటు హర్షల్ పటేల్, డేవిడ్ పైన్ వంటి నాణ్యమైన బౌలర్లు తమ జట్టులో ఉన్నారని, హైదరాబాద్‌లోని ఫ్లాట్ వికెట్లపై బౌలింగ్ చేయడం ఒక సవాల్ అని నితీష్ స్పష్టం చేశాడు.

## ఆర్‌సీబీతో మ్యాచ్‌కు ధోని రీఎంట్రీ..?

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరగబోయే మ్యాచ్ కోసం చిన్నస్వామి స్టేడియం సిద్ధమవుతోంది. ఈ మ్యాచ్‌ను చూడటానికి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ధోనీ కండరాల నొప్పితో బాధపడుతున్నాడు. అందుకే, అతనికి రెండు వారాల పాటు విశ్రాంతి తీసుకోమని సలహా ఇచ్చారు. అయితే, ఇప్పుడు రాయల్ ఛాలెంజర్స్ బెంగళురుతో జరిగే మ్యాచ్‌కు అతను అందుబాటులో ఉంటాడా లేదా అనే దానిపై ఆసక్తి నెలకొంది. రాజస్థాన్ రాయల్స్ చేతిలో చెన్నై ఘోర పరాజయం చవిచూసింది. నేడు (ఏప్రిల్ 3) చెన్నై, పంజాబ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో తిరిగి ఫామ్‌లోకి రావాలని సీఎస్‌కే చూస్తోంది. ధోనీ కొంత మార్గదర్శకత్వం అందించి ఉంటాడని ప్రేక్షకులు భావిస్తున్నారు. అయితే, అతను నేటి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడా లేదా అనేది సందేహాస్పదంగా ఉంది. ధోనీ ఇటీవల అక్కడ ఒక ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. ఇది అభిమానులకు శుభవార్త. చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శన పేలవంగా ఉంటే జట్టును కాపాడటానికి ధోనీ బరిలోకి దిగవచ్చని ఈ రోజుకీ అంటున్నారు. అలాంటప్పుడు, బెంగాల్‌లో జరగనున్న మ్యాచ్‌కు ధోనీ హాజరవుతాడు. ఆర్‌సీబీ, సీఎస్‌కేల మ్యాచ్ అయినా, అభిమానులు దానిని బద్ధ శత్రువుల మధ్య పోరుగా భావిస్తారు. గత సీజన్‌లో, ఆర్‌సీబీతో జరిగిన రెండు మ్యాచ్‌లలోనూ చెన్నై ఓడిపోయింది. ఈసారి కూడా అదే ఫామ్‌ను కొనసాగించాలని చెన్నై యోచిస్తోంది.



## నా సక్సెస్ చూసి కుళ్లుకుంటున్నారు: రహానే



ఐపీఎల్ 2026లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ పరాజయంతో పాటు కెప్టెన్ అజింక్య రహానే స్లో బ్యాటింగ్ (10 బంతుల్లో 8 పరుగులు)పై విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన అజింక్య రహానే తన విమర్శకులను ఏకిపారేశాడు. తనపై కావాలనే ఓ ఎజెండాతో కొందరు నెగిటివ్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను సాధించిన విజయాలు, క్రికెట్లో సాధించిన గుర్తింపును చూసి కొందరు అసూయ పడుతున్నారని.. అందుకే చిన్న చిన్న వైఫల్యాలను కూడా పెద్దవి చేసి చూపిస్తున్నారని రహానే మండిపడ్డాడు. తాను క్రీజులో ఉండటం ఇష్టం లేని వారే ఇటువంటి విమర్శలకు దిగుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశాడు. అజింక్య రహానే తన స్లో బ్యాటింగ్ గురించి విమర్శలను తోసిపుచ్చాడు. 2023 సీజన్ నుంచి టీ20ల్లో తన స్ట్రైక్ రేట్ మునుపటి కంటే చాలా మెరుగుపడిందని, అత్యుత్తమంగా ఉందని రహానే గుర్తు చేశాడు. విమర్శలు చేసేవారు బహుశా తన గణాంకాలను సరిగ్గా చూడటం లేదని లేదా కావాలనే కళ్లు మూసుకుంటున్నారని ఎద్దేవా చేశాడు. పవర్ ప్లేలో భారతీయ బ్యాటర్లలో అభిషేక్ శర్మ తర్వాత అత్యధిక స్ట్రైక్ రేట్ తనకే ఉందని.. ఇది తన ఆటలో వచ్చిన సానుకూల మార్పుకు నిదర్శనమని రహానే స్పష్టం చేశాడు. ఒక బ్యాటర్‌గా ప్రతి మ్యాచ్‌లోనూ ఒకే విధమైన వేగంతో ఆడటం సాధ్యం కాదని అజింక్య రహానే అభిప్రాయపడ్డాడు. కొన్ని సార్లు పిచ్ పరిస్థితులు లేదా బౌలర్ల వ్యూహాల నేపథ్యంలో బ్యాటింగ్‌లో ఫ్లో దొరకదని.. ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌లో అదే జరిగిందని వివరించాడు. తన గురించి మాట్లాడే వారికి కనీస గేమ్ సెన్స్ ఉందో లేదో అని రహానే ప్రశ్నించాడు. రహానే తన సంప్రదాయక ఆటను వదిలి ఇంతలా మెరుగుపడతాడని విమర్శకులు ఊహించలేదని.. అందుకే ఇప్పుడు ఏ చిన్న అవకాశం దొరికినా విమర్శించడానికి సిద్ధమవుతున్నారని అజింక్య రహానే చురకలు అంటించాడు. తనపై వస్తున్న నెగిటివ్ కామెంట్లను తాను పట్టించుకోనని అజింక్య రహానే తేల్చి చెప్పాడు. "ప్రజలు నా గురించి పాజిటివ్‌గా మాట్లాడుకున్నా, నెగిటివ్‌గా మాట్లాడుకున్నా నాకు సంతోషమే.. కనీసం నా గురించి చర్చిస్తున్నారు కదా" అని రహానే పేర్కొన్నాడు. స్టేడియం బయట జరిగే ప్రచారాల కంటే, తన స్వయంకృషిపైనే తనకు నమ్మకం ఎక్కువని రహానే స్పష్టం చేశాడు. గత పదేళ్లుగా క్రికెట్ ఆడుతున్న తనకు ఏం చేయాలో, ఎలా ఆడాలో బాగా తెలుసని, విమర్శకుల సూచనలు తనకు అవసరం లేదని రహానే తెగేసి చెప్పాడు. ముంబై ఇండియన్స్‌పై 40 బంతుల్లో 67 పరుగులు చేసి అదరగొట్టిన అజింక్య రహానే.. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలమవ్వడం కేకేఆర్ అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. పవర్ ప్లే తర్వాత అజింక్య రహానే స్ట్రైక్ రేట్ ఒక్కసారిగా పడిపోవడం జట్టుకు సమస్యగా మారుతోంది. 227 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కెప్టెన్ ఆరంభంలోనే తడబడటం జట్టు ఓటమికి ఓ ప్రధాన కారణమైంది. వరుస ఓటములతో సతమతమవుతున్న కేకేఆర్.. తన కెప్టెన్ నుంచి కేవలం మాటలే కాకుండా మైదానంలో మెరుపు ఇన్నింగ్స్‌లను కూడా ఆశిస్తోంది.

# ఆది కొత్త సినిమా సైరాబాను

## క్లాప్ కొట్టిన నటుడు కిరణ్ అబ్బవరం

టాలీవుడ్ యంగ్ హీరో ఆది సాయికుమార్ సరికొత్త లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. అన్ని హద్దులను చెరిపేసే ఒక అందమైన ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'సైరాబాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. ఈ ప్రాజెక్ట్ శుక్రవారం అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సినీ రంగానికి చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ముహూర్తపు సన్నివేశానికి యంగ్ హీరో కిరణ్ అబ్బవరం క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకుడు రామ్ అబ్బరాజు మరియు సీనియర్ నటుడు సాయికుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ రచయిత కోన వెంకట్ మరియు జైన్స్ నాని చిత్ర స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. ఇక ఈ మొదటి షాట్‌కు దర్శకుడు యోగి దర్శకత్వం వహించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కృష్ణకాంత్ పరుచూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫణి క్రిష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాంధవి శ్రీధర్ కథానాయికగా నటిస్తోంది. శేఖర్ చంద్ర సంగీతాన్ని అందిస్తుండగా, రామ్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా మరియు ఛోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈ ఫీల్ గుడ్ లవ్ స్టోరీ రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.







# ఓటీటిలోకి ఎస్ సరస్వతి మూవీ

వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'ఎస్. సరస్వతి'. గత నెల మార్చి 6న థియేటర్లలో విడుదలై ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి అడుగుపెట్టింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాలో వరలక్ష్మితో పాటు ప్రకాశ్ రాజ్, ప్రియమణి, జీవా, మురళీ శర్మ, రావు రమేశ్, రాధికా శరత్‌కుమార్ వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు. కథ విషయానికి వస్తే, లక్ష్మి అనే ఓ అనాథ మహిళ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ తన కూతురు 'ఎస్. సరస్వతి'ని ఎంతో ప్రేమగా పెంచుకుంటుంది. అయితే ఆగస్టు 15న తన కూతురిని స్కూల్లో దించి ఉద్యోగానికి వెళ్లిన లక్ష్మి.. ఆ తర్వాత తన కూతురు కనిపించడం లేదని, స్కూల్లోనే ఆమెపై అఘాయిత్యం జరిగిందని పోలీసులను ఆశ్రయిస్తుంది. పోలీసులు విచారించగా అసలు అలాంటి పాపే ఆ స్కూల్లో లేదని తేలడంతో కథ ఊహించని మలుపు తిరుగుతుంది. ఇంతకీ ఆ పాప ఏమైంది, లక్ష్మి చెబుతున్నది నిజమా లేక ఇదంతా ఆమె భ్రమా అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సస్పెన్స్ థ్రిల్లర్ సాగుతుంది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన వారు ఇప్పుడు నేరుగా ప్రైమ్ వీడియోలో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.



# కొత్త మూవీని ప్రకటించిన సాయిదుర్గా తేజ్

వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు సాయి దుర్గా తేజ్. తాజాగా ఆయన ఒక కొత్త మూవీని ప్రకటించారు. 'క' సినిమాతో విజయాన్ని అందుకున్న సుజీత్, సందీప్ ల దర్శకత్వంలో సాయిదుర్గా తేజ్ హీరోగా ఈ చిత్రం రానుంది. 'ఎస్‌డీటీ 19' వర్కింగ్ టైటిల్‌తో దీన్ని అధికారికంగా ప్రకటించారు. 'యుగాలుగా బయటకు రాని రహస్యాలు, ఊహకు అందని శక్తులు.. అత్యంత శక్తిమంత ప్రయాణమిది' అని క్యాప్షన్‌తో దీనిపై పోస్ట్ పెట్టారు. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది. ప్రస్తుతం సాయిదుర్గా తేజ్ 'ఎస్.వై.జి' (సంబరాల ఏటిగట్టు)తో బిజీగా ఉన్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. రోహిత్.కె.పి. దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. దీనిపై ఇటీవల ఈ హీరో మాట్లాడుతూ.. 'బ్రో' తర్వాత ఖరారైన నా రెండు సినిమాలు ఆగిపోయాయి. ఆ తర్వాత ఇందులో నటించే అవకాశం వచ్చింది. ఈ సినిమా కోసం నా సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా కష్టపడుతున్నా. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా నా కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుందని అన్నారు.




## ఒత్తిడిని తట్టుకునే చిట్కాలతో ముందుకు సాగుతా: శ్రీలీల

పాత్రలో లీనమవడం ఎంత ముఖ్యమో, దానినుంచి బయటకు రావడం కూడా అంతే ముఖ్యం. షూటింగ్ ఒత్తిడి నుంచి బయటపడటానికి నేను కొన్ని చిన్నచిన్న అలవాట్లను చేసుకున్నాను. సంగీతం వినడం, కాసేపు ఒంటరిగా గడపడం, కుటుంబసభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడటం వంటివి నాకు ఉపశమనాన్ని ఇస్తాయని నటి శ్రీలీల తన అనుభవాలను పంచుకున్నారు. ఫ్రెండ్స్‌తో చిట్‌చాట్ చేయడం నాకు రిలీఫ్‌గా ఉంటుంది. నేను పని ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్లకూడదని ప్రయత్నిస్తాను. ఒకవేళ పొరపాటున అలా జరిగినా, పైన చెప్పిన చిన్న చిన్న పద్ధతులు నన్ను మళ్లీ మామూలు స్థితికి తీసుకువస్తాయి. కొన్నిసార్లు పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం సర్దుబాటు చేసుకుంటూ ముందుకుసాగడమే ఏకైక మార్గం అని శ్రీలీల తెలిపారు. ప్రస్తుతం శ్రీలీల కోలీవుడ్‌లో బిజీగా మారింది. 'పరాశక్తి'తో తమిళనాట అడుగుపెట్టిన ఆమె ధనుష్‌తో కలిసి 'డీ55' (వర్కింగ్ టైటిల్)లో నటిస్తోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఇది రానుంది. దీనితో పాటు అనురాగ్ బసు దర్శకత్వంలో బాలీవుడ్ ఎంట్రీకి కూడా శ్రీలీల సిద్ధమవుతున్నారు.

Edited, Printed, Published and Owned by Y.LINGAIAH. H.No. 2-10-18, Mukarampura,Karimnagar-505001,Telangana and Printed at Rimsha Printers, H.No.5-16/1, Algunur(V),Timmapur (M0,District:Karimnagar and Published at: H.No. 2-10-18, Mukarampura,Karimnagar-505001,Telangana. Editor: Y.LINGAIAH. RNI No. APTEL/2007/20575. Cell 9346927559. Email-chatimpu99@gmail.com.